

జాగిలంతో రైళ్లలో విస్తృత తనిఖీలు

అనంతపురం క్రైం, సెప్టెంబరు 29: డ్రగ్స్ నియంత్రణే లక్ష్యంగా అనంతపురంలో పోలీసులు రైళ్లలో విస్తృత తనిఖీలు చేపట్టారు. నార్కోటిక్స్ పసిగట్టడంలో శిక్షణ పొందిన ఫైనీ జాగిలం ద్వారా జిల్లా కేంద్రం మీదుగా వెళ్లే రైళ్లలో స్థానిక త్రీటౌన్ పోలీసులు ఆదివారం తనిఖీలు చేశారు. ఎస్ఐ గోపాలుడు ఆధ్వర్యంలో త్రీటౌన్ పోలీసులు, సిబ్బంది బాంబు డిస్పోజబుల్ బృందం, జీఆర్పీ పోలీసులు సంయుక్తంగా ఒడిశాలోని భువనేశ్వర్ నుంచి బెంగళూరుకు వెళ్లే ప్రశాంతి ఎక్స్‌ప్రెస్ రైలులో క్షుణ్ణంగా తనిఖీలు చేశారు. అనుమానాస్పద వ్యక్తులను ప్రశ్నించారు. వారి లగేజీలను తనిఖీ చేశారు.

ముడుపులిస్తే చాలు....!

- ఎక్కడైనా.. ఏమైనా.. కట్టుకోవచ్చు
- అనంతలో పెరిగిన అక్రమ కట్టడాలు
- నిబంధనలకు చెల్లుచీటీ
- టౌన్‌ప్లానింగ్ అధికారులకు మామూళ్లు
- వైసీపీ ఆక్రమణలపై చర్యలు నిల్
- పార్కింగ్ లేకుండా ప్రధాన రోడ్లలో భవంతులు



రవి పెట్రోల్ బంక్ సమీపంలో నిర్మిస్తున్న ఫంక్షన్ హాల్


అనంతపురం క్రైం, సెప్టెంబరు 29: అనంతపురం నగరంలో రోజురోజుకు అక్రమ కట్టడాలు పెరిగిపోతున్నా యి. ప్రధాన రహదారుల్లో సైతం పార్కింగ్ లేకుండానే అడ్డదిడ్డంగా భారీ భవనాలు కట్టేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా బిల్డింగ్‌లు నిర్మిస్తుంటే నగరపాలక టౌన్‌ప్లానింగ్ అధికారులు మాత్రం ముడుపులు పుచ్చుకుంటూ ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. నగరంలో చాలా భవనాలు పక్కపక్కనే చుట్టూ కనీసం మూడు అడుగుల ఖాళీ కూడా ఇవ్వకుండా సెట్‌బాక్స్ (గాలి వెలుతురు అందకుండా)లేకుండా నిర్మిస్తున్నారు.

నగర నడిబొడ్డున కార్పొరేటర్ వసూళ్ల పర్వం

నగర నడిబొడ్డు కమలానగర్ ప్రాంతానికి ఆయన కార్పొరేటర్. ఇది బాగా జన సమ్మర్థం ఉన్న ప్రాంతం. ఇక్కడ వ్యాపారాలు కూడా బాగా జరుగుతాయి. అందుకే కమలానగర్‌లో భూముల ధరలు ఎక్కువే. కమర్షియల్ భవనాలకు అద్దెలు కూడా ఎక్కువగా ఉంటాయి. అక్కడ కట్టే భవనాలకు డిమాండ్ ఉంటుంది. అందులోనూ అక్రమ కట్టడాలు కావడంతో అధికారులకు, స్థానిక నాయకులకు ముడుపులు ఇచ్చుకోవాల్సి ఉంటుంది. దీంతో ఆ కార్పొరేటర్ తన అనుచరున్ని పంపి ప్రతి బిల్డింగ్ నుంచి వసూలు చేసుకొస్తున్నారట. రూ.లకారాలకు తగ్గదని సమాచారం. కానీ ఈయన కౌన్సిల్ సమావేశాల్లో మాత్రం అభివృద్ధి కనిపించదు, పరిష్కరించకపోతే రాజీనామా చేస్తానంటూ నీతి సూత్రాలు చెబుతుంటారు. గత మూడేళ్లలో కొన్ని భవనాల నుంచి భారీగా సొమ్ము చేసుకున్నట్లు సమాచారం.

నిత్యం ఎక్కడో ఓచోట...

నగరంలో ఎప్పుడూ ఎక్కడో ఒక చోట బిల్డింగ్ నిర్మాణాలు జరుగుతూనే ఉంటాయి. డీవియేషన్ నుంచి అదనపు అంతస్తు వరకు 80 నుంచి 90శాతం అక్రమాలే ఉంటాయి. నగరంలోని నాలుగోరోడ్డు మాస్టర్‌ప్లాన్ ప్రకారం 60 అడుగులుండాల్సి ఉండగా ఆక్రమణలతో 45, 50 అడుగులకు కుంచించుకుపోయింది. అక్కడ రోడ్డును ఆక్రమించి బిల్డింగ్‌లు కడుతున్నా చర్యలు తీసుకోవడం లేదు. లక్ష్మీనగర్ సమీపంలో ఓ ఖాళీస్థలంలో వేకెంట్ ల్యాండ్ టాక్స్(వీఎల్‌టీ) చెల్లించకుండానే ఓ ఫంక్షన్ హాల్ నిర్మిస్తున్నారు. వీఎల్‌టీ కోసం రెవెన్యూ అధికారులు పట్టుబడుతున్నట్లు తెలిసింది. టౌన్‌ప్లానింగ్ అధికారులు రెండు సార్లు నిర్మాణాన్ని తొలగించినా మార్పు రాకపో వడం గమనార్హం. చివరకు నోటీసులిచ్చామని చెబుతున్నా రు. 35సెంట్లకు పైగా ఉన్న ఈ స్థలం లో భవనాలు నిర్మిస్తు న్నా అహుడా అధికారులు ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. ఈ వ్యవహారంలో రూ.లక్షలు చేతులు మారినట్లు ఆరోపణలు బహిరంగంగా వి ని పిస్తున్నాయి. బళ్లారి రోడ్డులో ఓ భారీ కమర్షియల్ బిల్డింగ్‌లో అనధికారికంగా సెల్లార్ నిర్మిస్తున్నారు. ఈ బిల్డింగ్ నుంచి అధికారులకు ముడుపులు అందినట్లు సమాచారం. నడిమివంక సమీపంలో ఒక సెంటు స్థలంలో ఏకంగా నాలుగు ఫ్లోర్లు, సెల్లార్ నిర్మిస్తున్నారు. సెంటులోనే ఇంత బిల్డింగ్‌కు ఎలా అనుమతి చ్చారో...వారెలా కట్టారో..?



స్టిల్ట్ పేరుతో సెల్లార్లు

అనుమతుల్లేకపోయినా పార్కింగ్ సాకు చెప్పి స్టిల్ట్ పర్మిషన్ తీసుకుని సెల్లార్లు నిర్మిస్తున్నారు. వాటిని చాలా వరకు కమర్షియల్‌గా వాడేస్తున్నారు. జీప్లస్ 2 వరకు అనుమతి తీసుకుని జీప్లస్ 4 భవనాలు నిర్మిస్తున్నారు. 14 శాతం బెటర్‌మెంట్ చార్జెస్ లేకుండా, వేకెంట్ ల్యాండ్ టాక్స్(వీఎల్‌టీ)లేకుండా నిర్మించిన భవనాల్లోనూ అధికారులకు ముడుపులందాయి. వైసీపీ అధికారంలో ఉన్న గత ఐదేళ్లలో ఎక్కువశాతం భవనాలు అలా నిర్మించినవే. ఇక నగరపాలికకు చెందిన ఓపెన్ స్పేస్(స్థలాల)ఆక్రమణలకు దిక్కు లేకుండా పోయింది. ప్రభుత్వం మారినా వాటిపై చర్యలు తీసుకోవడంలో అధికారులు వెనుకడుగేస్తుండటం గమనార్హం. భవనాలు, ఆక్రమణలు ఇలా రెండింటి పట్ల ఎందుకు చర్యలు తీసుకోలేదని ఎవరైనా ప్రశ్నిస్తే నోటీసులిచ్చామంటూ సమాధానం చెబుతున్నారు.

అర్థం కాని పరిస్థితి. ఇందులో కూడా ఫైసలే పనిచేశాయనడంలో ఎలాంటి సందేహం లేదు. ఉపాధ్యాయ భవన్ ఎదురుగా అనుమతులు లేకుండా సెల్లార్ నిర్మించారు. దీనికి రాజకీయ పలుకుబడితో పాటు ఆమ్యామ్యాలు అందినట్లు తెలిసింది. వీటన్నింటి వెనుకా కార్పొరేటర్లు, రాజకీయ నాయకులే అభయహస్తం అందించినట్లు సమాచారం. నగరంలో ఓ బిల్డింగ్‌కు 14శాతం చార్జెస్ చెల్లించకుండా టౌన్‌ప్లానింగ్ అధికారి ముడుపులు పుచ్చుకుని చక్రం తిప్పినట్లు సమాచారం.



ఉపేక్షించేది లేదు: నాగరాజు, నగర కమిషనర్

అక్రమ కట్టడాల విషయంలో ఉపేక్షించేది లేదు. ఆక్రమణలపై చర్యలు తీసుకుంటాం. నగర ప్రజలు, భవన యజమానుల్లోనూ మార్పు రావాలి. గాలి, వెలుతురు సరిగా అందకపోతే ప్రశాంతంగా ఎలా జీవిస్తారు. టౌన్‌ప్లానింగ్ అధికారులతో సమీక్షిస్తా. ప్రజల్లో మార్పు తీసుకురావడానికి అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తాం.



కార్పొరేషన్ స్థలంలో వైసీపీ షెడ్డు

నగరంలోని మారుతీనగర్ ఎక్స్‌టెన్షన్‌లో వైసీపీ మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి తాను నివాసముంటున్న ఇంటికెదురుగా ఉన్న కార్పొరేషన్ స్థలంపై కన్నేశారు. పార్టీ కార్యాలయం కోసమని షెడ్డు నిర్మించి చుట్టూ ప్రహరీ నిర్మించాడు. పార్టీ అధికారంలో ఉండటంతో టౌన్‌ప్లానింగ్ అధికారులు నోరు మెదపలేదు. కేవలం నోటీసులిచ్చామని చెప్పారంతే. ప్రభుత్వం మారి నాలుగు నెలలైనా టౌన్‌ప్లానింగ్ అధికారులు అటు వైపు చూడకపోవడం విమర్శలకు తావిస్తోంది. నగరంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని సెంట్రల్ పార్కులోనూ వైసీపీ నాయకులు కబ్జా చేశారన్న ఆరోపణలున్నాయి. మాజీ మున్సిపల్ చైర్మన్ కుటుంబానికి చెందిన ఓ వైసీపీ నాయకుడు నాలుగేళ్ల కిందటం ఓ బిల్డింగ్ కట్టడానికి ప్రయత్నించాడు. దీనిపై అప్పట్లో పత్రికల్లో కథనాలు రావడంతో అధికారులు నిలిపేశారు. కానీ వైసీపీ అధికారంలో ఉండటంతో సెంట్రల్‌పార్కుకు చెందిన కొంత స్థలం ఆక్రమించి పెద్ద బిల్డింగ్ కట్టేశాడు. ఈ విషయంలో అధికారులకు ఆమ్యామ్యాలు ముట్టినట్లు సమాచారం.



వైసీపీ జిల్లా కార్యాలయం కూడా..

ఎలాంటి అనుమతి లేకుండా కేవలం అధికారంలో ఉన్నామనే దర్పంతో వైసీపీ జిల్లా ఆఫీస్‌నే కట్టేశారు. హెచ్చెల్సీ కాలనీలో ప్రభుత్వ భూమిని లీజుకు తీసుకుని కార్పొరేషన్ నుంచి ఎలాంటి అప్రూవల్స్ లేకుండా కట్టేశారు. ఇదంతా తెలిసి కూడా టౌన్‌ప్లానింగ్ అధికారులు కానీ అహుడా అధికారులు కానీ చర్యలు తీసుకోలేకపోయారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నోటీసులు జారీ చేశారు. దీంతో వైసీపీ వారు కోర్టుకెళ్లారు.

అడ్డదారుల్లో.. అంతులేకుండా..

- సబ్సిడీ విత్తన వేరుశనగలో అక్రమాలు
- లబ్ధిదారులకు తెలియకుండా స్వాహా
- ఫేక్ సెల్ నంబర్లతో మాయాజాలం
- అక్రమాలపై తూతూమంత్రంగా విచారణ
- మినీ కిట్లలో అధికారులు, వైసీపీ నాయకుల చేతివాటం



గుంతకల్లు, సెప్టెంబరు 29: ప్రభుత్వం సరఫరా చేసిన సబ్సిడీ విత్తన వేరుశనగను కొంతమంది అప్పనంగా మింగేశారు. సబ్సిడీ విత్తన పంపిణీలో అక్రమాలు జరిగా యని విమర్శలు రావడంతో వ్యవసాయ అధికారులు తూతూ మంత్రంగా విచారణ జరిపారు. విత్తన అవకతవ కలపై ఉన్నతాధికారుచే విచారణ చేయించాల్సింది పోయి ఒక ఏఓతో విచారణ చేయించారు. కొన్ని గ్రామాల్లో కనీసం పది మందిని కూడా విచారించకుండా మమ అనిపించేశారు. ఉరవకొండ వ్యవసాయ డివిజన్ పరిధిలోని గ్రామాల్లో అక్రమాలను విచారించకుండా అంతా బాగుందంటూ పత్రికా ప్రకటన ఇచ్చేసి చేతులు దులుపుకున్నారు. అయితే వాస్తవాలు మరోలా ఉన్నాయి. ఫేక్ సెల్ ఫోన్ నెంబర్లు, ఇన్‌వ్యాలిడ్ నెంబర్లను లబ్ధిదారులకు చేర్చి అడ్డదారుల్లో ఓటీపీని సంగ్రహించి సబ్సిడీ విత్తనాన్ని కాజేశారు. పెట్టుబడులు, వాతావరణ పరిస్థితులకు వెరచి ఈ సంవత్సరం సాధారణ సాగు కంటే అతి తక్కువగా వేరుశనగ పంట సాగు చేశారు. కానీ సబ్సిడీ వేరుశనగ మాత్రం గతంలో మాదిరిగానే అమ్మారు. విత్తనాన్ని తీసుకున్నట్లుగా రికార్డుల్లో ఉన్న రైతులు ఈ-క్రాప్ బుకింగ్‌ను మాత్రం కంది ఇతర పంటలకు చేసుకున్నారు. లబ్ధిదారుల జాబితాలను వ్యవసాయ శాఖ గడచిన ఐదేళ్లూ అత్యంత గోప్యంగా ఉంచింది. మినీ కిట్ల విషయమూ అంతే. నకిలీ సెల్ నెంబర్లు, నాట్ వర్కింగ్ నెంబర్లతో లబ్ధిదారులకు తెలియకుండానే సబ్సిడీ విత్తనాన్ని మింగేశారు.

ఓటీపీ మాయాజాలం

2023-24 ఏడాదికి సంబంధించి సబ్సిడీ విత్తన వేరుశనగ అక్రమాలపై విచారణ చేస్తుండగా వ్యవసాయ శాఖ చేసిన ఓటీపీ మాయాజాలం వెలుగులోకి వచ్చింది. రైతులకు సబ్సిడీ విత్తన వేరుశనగతోపాటు కొందరు చిన్న, సన్నకారు రైతులకు గత ఏడాది ఇచ్చిన కంది, వేరుశనగ మినీ కిట్లలో అధికారులు చేసిన ఓటీపీ అక్రమాలు వెలుగుచూశాయి. లబ్ధిదారులకే తెలియకుండా ఫేక్ సెల్‌ఫోన్ నెంబర్లను నమోదు చేసి, ఓటీపీ రిజెక్ట్ అయ్యేలా చేసి రెండో సారి ఆధార్ నెంబర్ ద్వారా రీసెండ్ ఓటీపీ సాయంతో యాప్‌ను పక్కదారి పట్టించారు. ప్రభుత్వం ఉచితంగా ఇచ్చిన కంది, వేరుశనగ మినీ కిట్లకు ఎంపికైన లబ్ధిదారుల పేర్లు, సెల్‌ఫోన్ నెంబరును ఈకేవైసీలో నమోదుచేసి, ఫోన్ నెంబరుకు వచ్చే ఓటీపీని తిరిగి యాప్‌లో ఎంట్రీ చేయడం ద్వారా లావాదేవీ పూర్తి చేయాల్సి ఉంటుంది. ఇలా చేస్తే లబ్ధిదారుకు తెలిసిపోతుంది కనుక సర్వీస్ డెడ్ అయిన నెంబర్లను సేకరించి, వాటిని యాప్‌లో నమోదుచేసి ఓటీపీ రిక్వెస్ట్ ఫెయిల్ అయ్యేలా చేశారు. రెండో ఆప్షన్‌గా సెల్‌ఫోన్ నెంబరు స్థానంలో రైతు ఆధార్‌ను ఎంట్రీచేసి ఓటీపీ రీసెండ్ ఆప్షన్‌ను యాక్టివేట్ చేస్తే వీఏఏ లాగిన్‌లో ఓటీపీ కనిపిస్తుంది. ఆ ఓటీపీతో లబ్ధిదారులకు తెలియకుండా వ్యవహారాన్ని పూర్తి చేశారు. సబ్సిడీ విత్తనాన్ని కొనేటప్పుడు, ఈ-క్రాప్ బుకింగ్ చేసేటప్పుడు రైతులు ఆన్‌లైన్ థంబ్ ఇంప్రెషన్ వేసినప్పుడు ఉచిత విత్తనానికి కూడా అప్పుడే రైతులకు తెలియకుండా థంబ్ తీసేసుకున్నారు. ఈ రకంగా 30 కేజీల కదిరి-లేపాక్షి రకం వేరుశనగ మినీ కిట్లను ఇవ్వకుండా లబ్ధిదారులుగా ఎంపికైన రైతులకు శఠగోపం పెట్టారు. కొందరికి ఐదు కేజీల ఎల్ఆర్‌జీ-52 రకం కంది మినీకిట్లను ఇచ్చారు. కందితో తక్కువ లబ్ధి ఉండటంతో వాటిని రైతులకు ఇచ్చారు. కానీ వేరుశనగ కిట్లను మాత్రం మాయంచేశారు. మండలంలో ఎంపికైన లబ్ధిదారుల్లో 95 శాతం మంది వైసీపీకి చెందినవారుకాగా, వారికి కూడా తెలియకుండా ఉచిత విత్తనాన్ని కాజేశారు. వీఏఏ, వీహెచ్ఏ, ఎంపీఈఓ, తదితర వ్యవసాయ సహాయకుల ద్వారా అధికారులు, వైసీపీ నాయకులు ఈ కథ నడిపినట్లు తెలుస్తోంది.

లబ్ధిదారుల జాబితాలు ఆద్యంతం గోప్యం

తమ అవినీతి బహిర్గతమవుతున్న భావనతో గత ఐదేళ్లుగా సబ్సిడీ విత్తన వేరుశనగ, ఉచిత కంది లబ్ధిదారుల జాబితాలను అత్యంత గోప్యంగా ఉంచారు. జాబితాలను వ్యవసాయ, సచివాలయ, ఆర్బీకే, హార్టికల్చర్ కార్యాలయాలలో ప్రచురించి విషయాన్ని పారదర్శకంగా ఉంచాల్సి ఉండగా, ఎవరు అడిగినా, చివరకు అప్పటి అధికార పార్టీకి చెందిన వారు కోరినా ఇవ్వకుండా మభ్యపెట్టారు. గడచిన రెండేళ్లలో రైతులు చాలా మంది వేరుశనగ కాకుండా కంది పంట సాగు వైపు వైపు మొగ్గారు. సాటి రైతులు ఎవరు వేరుశనగ విత్తనం అడిగినా వచ్చి థంబ్ వేసి ఇచ్చుకున్నారు. విత్తనం కే-6 రకం అని చెప్పినా సీడ్ కల్తీ ఉండటం, తాజా విత్తనంలో పాత సీడ్ కలిసి ఉండటం, తదితర కారణాలతో రైతులు సబ్సిడీ విత్తనాన్ని కొనడానికి ఆసక్తి చూపనేలేదు. కానీ రికార్డుల్లో మాత్రం సీడ్ అమ్ముడైపోయింది. ఈ సంవత్సరం సబ్సిడీ సీడ్ విషయంగా ఫిర్యాదులు వెళ్లగా విచారణకు వ్యవసాయ అధికారిని నియమించారు. ఏఓపై విచారణకు కనీసం ఏడీఏ స్థాయి అధికారిని నియమించా ల్సి ఉంది. కానీ పదిహేను రోజుల కిందట ఓ వ్యవసాయ అధికారిని డివిజన్‌లోని నాలుగు మండలాలకు సీడ్ అవినీతిపై విచారణకు పంపారు. ఆ అధికారి గ్రామాలకు వెళ్లి పది మంది రైతులను కూడా విచారించకుండా అంతా సవ్యంగా ఉందని, అవినీతి జరగలేదని పత్రికలకు ప్రకటన ఇచ్చి వెళ్లిపోయారు. సీడ్ తీసుకున్నవారు చేసిన ఈ-క్రాప్ బుకింగ్‌ను, రిజిస్టర్‌లో ఉన్న సెల్‌ఫోన్ నెంబర్లను ఒకసారి పరిశీలించి ఉంటే విషయం బయటపడేది.

సెల్ నంబర్లతో గోల్‌మాల్

ఎవరైనాసరే, సాధారణంగా ఏ లావాదేవీకైనా వ్యాలిడ్ సెల్ నంబరును ఇస్తారు. ఒకవేళ సెల్‌ఫోన్ పోగొట్టుకుపోవడం, రీచార్జ్ చేయకపోవడం, తదితర కారణాలతో ఓ ఐదు శాతం మంది ఫోన్లు పనిచేయకపోవచ్చు. కానీ సీడ్ లబ్ధిదారుల జాబితా నిండా రైతుల అసలు నంబరుకు ఏమాత్రం సంబంధంలేని ఫోన్ నంబర్లను, వేలకు వేలు డబ్బు ఖర్చుపెడితే తప్ప లభించని యూనిక్ నెంబర్లను, డెడ్ అయిన నెంబర్లను ఎంట్రీచేశారు. ఒకే నెంబరుపై పది మంది రైతులకు సీడ్ ఇచ్చినట్టుగా జాబితాలో నమోదు చేశారు. 2023-24 ఖరీఫ్‌లో నాగసముద్రంలో 9390125126 నెంబరుతో 26 మందికి సబ్సిడీ విత్తనాన్ని ఇచ్చారు. ఇదే గ్రామంలో 8978832852 అనే నెంబరుతో నలుగురికి ఉచిత సీడ్, ఏడుగురికి సబ్సిడీ సీడ్ ఇచ్చారు. అలాగే 8639035209 నెంబరుతో 11 మందికి సబ్సిడీ విత్తనాన్ని ఇచ్చారు. ఈ గ్రామంలో ఇవేకాక ఇంకొన్ని నంబర్లతో 8 మంది చొప్పున పలువురికి విత్తనాన్ని ఇచ్చేశారు. నెలగొండ గ్రామంలో 8309812931 నెంబరుతో పదిమందికి, పాతకొత్తచెరువు గ్రామంలో 9705509706 నంబరుతో 24 మంది విత్తనాన్ని పొందారు. అలాగే ములకలపెంట గ్రామంలో 9533299905 నెంబరుతో 15 మంది, 9182165975 నంబరుతో 14 మంది, 9966262260 నంబరుతో తొమ్మిది మంది, నక్కనదొడ్డి గ్రామంలో 9849710732 నంబరుతో 11 మంది, 9550477358 నంబరుతో 9 మంది, తిమ్మాపురం గ్రామంలో 9652153826 నంబరుతో 21 మంది విత్తనాన్ని తీసుకున్నారట. ఇక ఒక నంబరుపై ఆరేడు మంది విత్తనం తీసుకున్న ఉదాహరణలు కొల్లలుగా ఉన్నాయి. ఈ నెంబర్లతో విత్తనాన్ని తీసుకున్న రైతులు ఒకరికొకరు బంధువులు, స్నేహితుకారు. ఎస్సీలు, ఎస్టీలు, బీసీలు, ముస్లిం మైనారిటీలు ఒకే నంబరుతో సీడ్ పొందినట్టుగా రికార్డు చేశారు. గడచిన ఐదేళ్లలో ప్రతి సంవత్సరం ఇదే జరిగి ఉంటుందన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఉన్నతాధికారులు స్పందించి లబ్ధిదారుల జాబితాలను కూలంకషంగా విచారణ జరపాల్సి ఉంది.



ఉచిత వేరుశనగ ఇవ్వలేదు: పి. వినోద్ కుమార్, పాతకొత్తచెరువు

నాకు 2023లో వేరుశనగ మినీ కిట్ ఇచ్చినట్టుగా రికార్డు చేశారు. నా పేరుపై ఎవరు తీసుకున్నారో తెలియదు.



మినీ కిట్ రాలేదు: కుమారస్వామి, పాతకొత్తచెరువు

నాకు ఎటువంటి ఉచిత విత్తనం ఇవ్వలేదు. కానీ నాపేరును లబ్ధిదారుల జాబితాలో చేర్చారు. కనీసం నా పేరిట మినీ కిట్ జారీ అయ్యిందన్న విషయం కూడా నాకు తెలియదు.



నా కొడుకు పేరుతో మోసం: వెంకటపతి నాయుడు, పాతకొత్తచెరువు

నా కొడుకు మురళీకృష్ణ పేరుపై వేరుశనగ మినీ కిట్ ఇచ్చినట్లు వ్యవసాయ అధికారులు రికార్డు రాశారు. మాకు ఎటువంటి ఉచిత విత్తనం ఇవ్వలేదు. నా కొడుకు పేరుతో మోసం చేశారు.



రైతులెవరూ ఫిర్యాదు చేయలేదు
పద్మజ, వ్యవసాయ డివిజనల్ అధికారి, ఉరవకొండ

వ్యవసాయ డివిజన్ పరిధిలో విత్తన అక్రమాలపై కమిషనరేట్‌కు వెళ్లిన ఫిర్యాదులపై విచారణ జరిగింది. విచారణలో రైతులెవరూ ఫిర్యాదు చేయలేదు. విచారణకు ఏడీఏ స్థాయి అధికారినే నియమించినా, సమయాభావం కారణంగా ఏఓలతో రాండమ్ ఎంక్వయిరీ చేయించాం. విచారణ నివేదికను ఉన్నతాధికారులకు పంపారు. ఏపీ సీడ్స్ సంస్థకు కూడా డబ్బు సక్రమంగా చెల్లించారు. విచారణలో లబ్ధిదారులు ఫిర్యాదు చేయలేదు కనుక అక్రమాలు జరగలేదని భావిస్తున్నాం.

అమ్మకు కడుపుకోత..!

- జిల్లాలో పెరిగిన సిజేరియన్లు
- సాధారణ కాన్పులకు కొందరు డాక్టర్ల అయిష్టత
- ఆరోగ్య సమస్యలు తప్పవంటున్న నిపుణులు
- నిద్రమత్తులో వైద్యశాఖ యంత్రాంగం



జిల్లా ఆస్పత్రిలోని కాన్పుల వార్డులో చికిత్స పొందుతున్న సిజేరియన్ బాలింతలు (ఫైల్)

అనంతపురం టౌన్, సెప్టెంబరు 29: జిల్లాలో ఇటీవల విచ్చలవిడిగా సిజేరియన్లు జరుగుతున్నాయి. డబ్బుల మీద యావతో ప్రసవం అంటే చాలు కడుపు కోసి, బిడ్డను బయటకు తీస్తున్నారు. కొన్నేళ్ల కిందట కాన్పు అంటే రెండు రోజులైనా సరే వైద్యసిబ్బంది శ్రమించి సాధారణంగా జరిపించేవారు. అపుడు సిజేరియన్ అంటే చాలా భయపడేవారు. చాలా అరుదైన కేసుల్లో మాత్రమే సిజేరియన్‌కు వెళ్లవారు. ఇప్పుడు ఇదంతా రివర్స్ అయ్యింది. సాధారణ కాన్పు అరుదైపోయింది. ఇది చాలా ఆందోళన కలిగించే విషయం. జిల్లాలో సగానికి పైగా సిజేరియన్ కాన్పులే ఉంటున్నట్లు వైద్యశాఖ రికార్డులు చెబుతున్నాయి. ఇందులో ప్రైవేట్ ఆస్పత్రులలో అధికంగా సిజేరియన్ కాన్పులు ఉంటున్నాయి.

ప్రైవేట్‌లో ఇష్టారాజ్యంగా కోతలు

ప్రసవానికి ప్రైవేట్ ఆస్పత్రులకు వెళితే చాలు.. సిజేరియన్ తప్పదు అనేలా ఉంది పరిస్థితి. వైద్యశాఖ లెక్కలు మేరకు గత రెండున్నరేళ్లలో జిల్లాలో 1,17,660 ప్రసవాలు జరిగాయి. ఇందులో 45,981 సిజేరియన్ కాన్పులు ఉన్నాయి. వీటిలో ప్రభుత్వ ఆస్పత్రులలో 15204, ప్రైవేట్ ఆస్పత్రులలో 30 777 సిజేరియన్ కాన్పులు ఉన్నాయి. 2021-22లో జిల్లా లో 39512 ప్రసవాలు జరిగాయి. ఇందులో ప్రభుత్వ ఆస్పత్రులలో 16574, ప్రైవేట్ ఆస్పత్రులలో 22938 జరిగాయి. ఇందులో 14078 మందికి సిజేరియన్ చేశారు. వీటిలో ప్రభుత్వ ఆస్పత్రులలో 4606, ప్రైవేట్ ఆస్పత్రులలో 9472 సిజేరియన్ ఆపరేషన్లు జరిగాయి. 2022-23లో 39886 ప్రసవాలు జరగ్గా, ఇందులో ప్రభుత్వ ఆస్పత్రులలో 16585, ప్రైవేట్ ఆస్పత్రులలో 23301 ప్రసవాలు జరిగాయి. వీటిలో 15787మందికి సిజేరియన్‌కాన్పులు చేయగా ఇందులో ప్రభు త్వ ఆస్పత్రులలో 5186, ప్రైవేట్ ఆస్పత్రులలో 10601 సిజేరియన్ ప్రసవాలు చేశారు. 2023-24లో ఇప్పటివరకు 38195 కాన్పులు జరిగాయి. ఇందులో ప్రభుత్వ ఆస్పత్రులలో 16060ఉండగా ప్రైవేట్ ఆస్పత్రులలో 22135 కాన్పులు జరిగాయి. వీటిలో మొత్తంమీద 16116 సిజేరియన్లు జరగగా ఇందులో ప్రభు త్వ ఆస్పత్రులలో 5412ఉండగా ప్రైవేట్ ఆస్పత్రులలో 10704సిజేరియన్ కాన్పులు ఉన్నా యి. దీన్నిబట్టి సిజేరియన్ కాన్పులు ఏడాదికేడాది పెరుగుతూనే ఉన్నాయని అర్థం అవుతోంది.

ఆరోగ్యశ్రీతో మరింత కక్కుర్తి

హైరిస్క్ కేసులకు సిజేరియన్ చేయాల్సి వస్తుంది. అపుడు పేదలు ఖర్చుపెట్టుకోలేరని అలాంటి వారికి ఆరోగ్యశ్రీద్వారా సిజేరియన్ చేయ డానికి అవకాశం కల్పించారు. ప్రైవేట్ ఆస్పత్రులలో సాధారణ డెలివరీలకు రూ.8వేలు, సిజేరియన్ జరిగితే రూ.15వేలు ప్రభుత్వం ఆరోగ్యశ్రీ ద్వారా అందజేస్తుంది. ఇదే ప్రైవేట్ ఆస్పత్రులకు వరంగా మారింది. కాన్పుకు వస్తే చాలు మామూలు కాన్పు అవుతుందని తెలిసినా ఏదో ఒక కారణంతో గర్భిణుల కుటుంబ సభ్యులను భయపెట్టి సిజేరియన్‌కు ఒప్పించి చేసేస్తున్నారు. సాధారణ కాన్పు కన్నా సిజేరియన్ రిస్క్‌లేని కాన్పు అన్న భావనతోనే ప్రైవేట్‌లో డాక్టర్లు ఇటీవల ఇష్టారాజ్యంగా కోతలు కోస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. సిజేరియన్ చేస్తే ప్రభుత్వం నుంచి ఆరోగ్యశ్రీ ద్వారా వచ్చే సొమ్ముతో పాటు అదనంగా బాధితులతో రూ.10వేల నుంచి రూ. 20వేల వరకు వసూలు చేస్తూ జేబులు నింపుకుంటునే ప్రచారం ప్రైవేట్ ఆస్పత్రులపై ఉంది. ఈఅడ్డగోలు సిజేరియన్ వ్యవహారాలకు అడ్డుకట్ట వేయాల్సిన వైద్య శాఖ, ఆరోగ్యశ్రీ అధికార యంత్రాంగం మామూళ్లు తీసుకొని మిన్నకుండిపోయాయనే విమర్శలు వినవస్తున్నాయి.



సిజేరియన్లతో ఆరోగ్య సమస్యలు

హైరిస్క్ కేసులకే సిజేరియన్ చేయాల్సి ఉంటుంది, కానీ ఇటీవల గర్భిణి కుటుంబ సభ్యులే కొంచెం నొప్పులతో బాధపడితే తట్టుకోలేక సిజేరియన్ చేయమంటున్నారు. కొందరు ఆలస్యంగా పెళ్లి చేసుకుని 34 నుంచి 35 ఏళ్ల వయసులో గర్భం దాల్చుతున్నారు. బాల్య వివాహాలు చేయడం వల్ల చిన్న వయసులోనే గర్భం దాల్చుతున్నారు. వారికి తగినంత బలం ఉండదు. అలాంటపుడు డెలివరీ చేయడం కష్టంగా ఉంటుంది. అపుడు సిజేరియన్లకు డాక్టర్లు మొగ్గు చూపుతారు. సిజేరియన్లు చేయడం వల్ల కొన్ని ఆరోగ్యసమస్యలు వస్తాయి. మత్తు మందు ఇవ్వడం వల్ల ఒక్కోసారి ప్రాణానికే ప్రమాదం కూడా ఏర్పడవచ్చు. ఆపరేషన్ తర్వాత కూడా జాగ్రత్తలు తీసుకోకపోతే అనారోగ్యం బారిన పడాల్సి ఉంటుంది. అందుకే ఆరువారాలు పాటు విశ్రాంతి తీసుకోవాలి. ఆతర్వాత కూడా బరువు పనులు చేయకుండా ఉండాలి. సమతుల్యమైన ఆహారం, తగినంత నీరు తీసుకోవాలి.

- డాక్టర్ షంషాద్‌బేగం, గైనిక్ హెచ్‌ఓడీ, జిల్లా ఆస్పత్రి



సిజేరియన్లు ఎక్కువ చేసే ఆస్పత్రులపై చర్యలు

సాధారణ కాన్పులు చేయాలని అన్ని ఆస్పత్రుల యాజమాన్యాలు, డాక్టర్లు, సిబ్బందికి సూచిస్తున్నాం. గర్భిణులు, వారి కుటుంబ సభ్యులు తొందరపడి సిజేరియన్లు చేయించుకోవద్దని అవగాహన కల్పిస్తున్నాం. ఇప్పటికే ఏఏ ప్రైవేట్ ఆస్పత్రులలో ఎన్ని సిజేరియన్ల కాన్పులు జరిగాయో లెక్కలు తీసి ప్రభుత్వానికి నివేదించాం. ఏడు ఆస్పత్రులకు నోటీసులు ఇచ్చాం. ప్రభుత్వం నుంచి వచ్చే ఆదేశాల మేరకు ఆ ఆస్పత్రులపై చర్యలు తీసుకుంటాం.


- డాక్టర్ ఈవీ దేవి, డీఎంహెచ్ఓ

డీఈఓపై చర్యలు తీసుకోవాలి

ఫోర్టో రాష్ట్ర నాయకులు

అనంతపురం విద్య, సెప్టెంబరు 29: జిల్లా విద్యాశాఖాధికారిపై చర్యలు తీసుకోవాలని ఫోర్టో రాష్ట్ర నాయకులు డిమాండ్ చేశారు. డీఈఓను సస్పెండ్ చేసి, వెంటనే విచారణ చేపట్టాలని ఆ సంఘం రాష్ట్ర చైర్మన్ హరికృష్ణ, ప్రధానకార్యదర్శి అంకాల కొండయ్య, ముఖ్య సలహాదారులు శివానందరెడ్డి ఇతర నాయకులు ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. సుప్రీంకోర్టు తీర్పులు, ప్రాథమిక హక్కులను అపహాస్యం చేస్తూ, ఆర్టికల్ 19(1)(ఏ) ఉల్లంఘిస్తూ, టీచర్లను సస్పెండ్ చేస్తూ, ఉపాధ్యాయలోకాన్ని డీఈఓ భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. డీసీఈబీలో రూ. 31.80 లక్షల అక్రమాలు జరిగినట్లు విమర్శలు వస్తున్నా విచారణ చేయకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమగ్రశిక్ష ప్రాజెక్టు నుంచి పలువురు టీచర్లు రీప్యాట్రియేషన్ అయితే ఇద్దరికి అడ్డగోలుగా జిల్లా కేంద్రానికి దగ్గరల్లో పోస్టింగ్ ఇవ్వడం దారుణమన్నారు. ఇలా అనేక అక్రమాలు విద్యాశాఖలో జరిగినట్లు పత్రికల్లో అనేక కథనాలు వచ్చినా, డీఈఓపై చర్యలు తీసుకోకపోవడం శోచనీయమన్నారు.

ఆరు మండలాల్లో వర్షం



అనంతపురం అర్బన్, సెప్టెంబరు 29: జిల్లాలోని ఆరు మండలాల్లో శనివారం రాత్రి వర్షం పడింది. అత్యధికంగా బ్రహ్మసముద్రంలో 28.0 మి.మీ వర్షపాతం నమోదైంది. కళ్యాణదుర్గం 25.2, గుమ్మఘట్ట 24.6, శెట్టూరు 24.2, రాయదుర్గం 15.2, వజ్రకరూరు 14.2 మి.మీ వర్షపాతం నమోదైంది.

విస్తృత వ్యాఖ్యానమే విమర్శ

● ఆచార్య రాచపాళెం చంద్రశేఖర్‌రెడ్డి



మట్టిపూలు పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సాహితీవేత్తలు

అనంతపురం కల్చరల్, సెప్టెంబరు 29: బాధాసర్వద్రష్టులైన ప్రజల జీవిత మూలాలను సూత్రప్రాయంగా వ్యక్తీకరించిన కవుల కవిత్వాన్ని విస్తృతమైన వ్యాఖ్యానంతో పాఠకునికి చేరవేయడమే కవిత్వ విమర్శ అని కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత ఆచార్య రాచపాళెం చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం స్థానిక ఉపాధ్యాయ భవన్‌లో సీనియర్ కవి తూము చెర్ల రాజారామ్ రచించిన 'మట్టి పూలు' పుస్తక ఆవిష్కరణ సభను స్పందన అనంత కవుల వేదిక ప్రధాన కార్యదర్శి చంద్రశేఖరశాస్త్రి అధ్యక్షతన నిర్వహించారు. కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీతలు ఆచార్య రాచపాళెం చంద్రశేఖర్‌రెడ్డి, బండి నారాయణస్వామి ముఖ్యఅతిథులుగా హాజరై పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... రాయలసీమలో నివసిస్తున్న కవులందరూ రాయలసీమ కవులు కాదని, రాయలసీమ గురించి కవిత్వం రాసిన కవులే రాయలసీమ కవులని అభిప్రాయపడ్డారు. కవుల కవితాంతరంగాన్ని మట్టిపూలుగా సృజించిన విమర్శకవి రాజారామ్ అభినందనీయుడని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీనియర్ కవి రాధేయ, డాక్టర్ నాగేశ్వరాచారి, అంకె శ్రీనివాస్, తరిమెల అమరనాథరెడ్డి, టీవీ రెడ్డి, అశ్వత్థరెడ్డి, డాక్టర్ ప్రగతి, సుప్రియ, కృష్ణమూర్తి, సురేష్, పూజారి ఈరన్న తదితరులు పాల్గొన్నారు.

బియ్యంతో పాటు... కందిపప్పు, చక్కెర

● మూడు కిలోల జొన్నలు కూడా..
● రేపటి నుంచి పంపిణీకి సిద్ధం



రేషన్ పంపిణీ చేస్తున్న ఎండీయూ వాహనం

అనంతపురం టౌన్, సెప్టెంబరు 29: కార్డు లబ్ధిదారులకు శుభవార్త. ఈనెల కోటాకు సంబంధించి అక్టోబరు 1 నుంచి రేషన్ సరకులు పంపిణీ చేపడుతున్నారు. జూన్ నెల నుంచి సెప్టెంబరు వరకు బియ్యం మాత్రమే ఇచ్చి చేతులు దులుపుకున్నారు. డీలర్లమార్పుతో చాలా మంది లబ్ధిదారులకు బియ్యం కూడా సక్రమంగా అందలేదు. ఈసారి బియ్యంతో పాటు కందిపప్పు, చక్కెరకూడా రేషన్ సరకుల్లో పంపిణీ చేయనున్నారు.జొన్నలు కావాలంటే కనీసం మూడు కిలోల వరకు బియ్యం తగ్గించుకొని జొన్నలు ఇస్తామని అధికారులు ప్రకటించారు.

● అసలేం జరిగిందంటే..

టీడీపీ కూటమి ప్రభుత్వం జూన్‌లో బాధ్యతలు చేపట్టింది. ఆ నెలలో రేషన్ సరకుల పంపిణీపై దృష్టిపెట్టకపోవడంతో పాత డీలర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరించారు. జూలై నెలలో సీఎం చంద్రబాబునాయుడు చౌకడిపోల ద్వారా బియ్యంతో పాటు కందిపప్పు, చక్కెర, నూనె వంటి సరకులు పేదలకు రాయితీతో అందించాలని ఆదేశించారు. ఆ మేరకు ఆ గస్టు నుంచే బియ్యంతో పాటు చక్కెర, కందిపప్పు అందించాల్సి ఉంది. బియ్యం అందించి అధికారులు చేతులు దులుపుకుంటున్నారు. రేషన్ డీలర్ల మార్పుతో పాతబఫర్ స్టాక్ చూపించకపోవడంతో అరకొరగానే అందడంతో లబ్ధిదారులు తీవ్ర నిరాశకు గురయ్యారు. అక్టోబరు 1 నుంచి చేపట్టే పంపిణీలో కార్డుదారులకు బియ్యంతో పాటు కందిపప్పు, చక్కెర అందజేయనున్నారు. జిల్లాలో అధికారిక లెక్కల మేరకు 6,67,263 రేషన్‌కార్డు ఉన్నాయి. 1645 చౌకడిపోలు ఉన్నాయి. వీరికి ప్రతినెలా 9,716 మెట్రిక్ టన్నుల బియ్యం అవసరమవుతుంది. బియ్యంతో పాటు ఇతర సరకులు స్టాక్ పాయింట్ల నుంచి చౌకడిపోలకు సరఫరా చేశారు. కందిపప్పు 410 మెట్రిక్ టన్నులు కేటాయించారు. ఒక్కోకార్డుదారుడికి అర కిలో చక్కెర ఇస్తారు. 1వతేదీ నుంచి పంపిణీకి యంత్రాంగం సిద్ధమైంది. అయితే ఈసారి గోదుమపిండి ఇవ్వడంలేదు.



అందరికీ కందిపప్పు

ఈనెల నుంచి లబ్ధిదారులకు కందిపప్పు పంపిణీ చేస్తాం. జిల్లాకు 410 మెట్రిక్ టన్నుల కందిపప్పు కేటాయించారు. ఇప్పటికే వాహనాలలో సరకు జిల్లాకు వస్తోంది. అక్టోబరు 1న బియ్యంతో పాటు కిలో కందిపప్పు, అరకిలో చక్కెర ఇస్తున్నాం. జొన్నలు కావాలంటే మూడు కిలోలు ఇస్తాం. కందిపప్పు అందలేదని లబ్ధిదారులు ఆందోళన చెందాల్సిన అవసరంలేదు. తొలుత బియ్యం తీసుకున్నా పంపిణీ ముగిసేలోగా ప్రతి ఒక్కరికీ అందిస్తాం.

: రమేష్‌రెడ్డి, డీఎం, పౌరసరఫరాల శాఖ

●ఒక్కో కార్డుకు మూడు కిలోల జొన్నలు

పౌష్టికాహారం అందించాలనే ఉద్దేశంతో గత కొంతకాలంగా రాగులు, రాగిపిండి ఇస్తూవచ్చారు. ఈసారి జొన్నలు ఇవ్వాలని నిర్ణయించారు. బియ్యంతో పాటు కావాల్సిన వారికి 3 కిలోల వరకు జొన్నలు ఇస్తారు. బియ్యం కోటాలో తగ్గించుకుని మూడు కిలోల వరకు జొన్నలు ఇస్తారు. జిల్లాకు రెండు వేల టన్నుల జొన్నలు వచ్చాయి.

భార్య గొంతు కోసిన భర్త



జ్యోతి (ఫైల్)

గుమ్మఘట్ట, సెప్టెంబరు 29: కట్టుకున్న భర్త కాలయముడయ్యాడు. భార్యను గొంతు కోసి అతి కిరాతకంగా హతమార్చిన సంఘటన గుమ్మఘట్ట మండలం కలుగోడు గ్రామంలో శనివారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. గలగల గ్రామానికి చెందిన బోయ వన్నూరుస్వామి తన భార్య జ్యోతి(28)ని అతి దారుణంగా గొంతుకోసి పరారయ్యాడు. కుటుంబసభ్యులు తెలిపిన వివరాల మేరకు.. బోయ వన్నూరుస్వామికి ఎనిమిదేళ్ల క్రితం కలుగోడు గ్రామానికి చెందిన నరసింహప్ప, కాలమ్మ కూతురు జ్యోతినిచ్చి వివాహం చేశారు. వీరికి ఇద్దరు కూతుర్లు, ఓ కుమారుడు ఉన్నారు. దంపతుల మధ్య గొడవ జరగడంతో నెల రోజులుగా జ్యోతి పుట్టినిల్లు కలుగోడులో ఉంటోంది. తన వెంట రెండు కత్తులను దాచుకొని శనివారం రాత్రి భార్య వద్దకు చేరుకొని నమ్మించి పక్కన చేరి నిద్రించాడు. అర్ధరాత్రి భార్య జ్యోతి నోట్లో గుడ్డ పెట్టి గొంతుకోశాడు. బయట వరండాలో నిద్రిస్తున్న తల్లి కాలమ్మ సోదరులు దొనప్ప ఇంట్లో అలజడి శబ్దం విని చూసేలోగా జ్యోతి జీవచ్ఛవంలా రక్తపుమడుగుల్లో కనిపించింది. వన్నూరుస్వామిని ప్రతిఘటించి కత్తితో పొడిచే ప్రయత్నం చేయగా వారు దూరం జరిగారు. వెంటనే తలుపులు తెరిచి పరారైనట్లు వారు తెలిపారు. సంఘటనపై కళ్యాణదుర్గం డీఎస్పీ రవిబాబు, సీఐ వెంకటరమణ సంఘటనాస్థలానికి చేరుకొని జ్యోతి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నారు. నిందితుడి కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు తెలిపారు.

పాపం.. చిన్నారులు



తల్లి చిన్నారులను వదిలి పుట్టినిల్లు కలుగోడులో నెలరోజులుగా ఉంటుండగా చిన్నారులు శాంతమ్మ, వరలక్ష్మి, మా రన్న గలగల సమీపంలోని తోటలో అవ్వతాతల వద్ద ఉంటున్నారు. తల్లి జ్యోతిని తండ్రి వన్నూరుస్వామి గొంతు కోసి హతమార్చి పరారవడంతో చిన్నారులను ఇకపై ఎవరు సంరక్షిస్తారో అంటూ వారి బంధువులు, కుటుంబసభ్యులు ఆవేదన చెందుతున్నారు. చిన్నారులు తల్లిని కోల్పోగా తండ్రి జైలుకు వెళితే పిల్లల పరిస్థితి ఏమిటని కుటుంబసభ్యులు కన్నీరు పెడుతున్నారు.

ఈతకెళ్లి బాలుడి మృతి



మృతిచెందిన హర్షవర్ధన్

తాడిపత్రి, సెప్టెంబరు 29: మండలంలోని సజ్జలదిన్నె వద్ద పెన్నానది సమీపంలో ఉన్న నీటిగుంతలో పడి అదే గ్రామానికి చెందిన హర్షవర్ధన్ (15) ఆదివారం మృతిచెందాడని రూరల్ సీఐ శివగంగాధర్‌రెడ్డి తెలిపారు. కళ్యాణదుర్గం మండలం మొలకాపురం గ్రామానికి చెందిన ఉమాశంకర్, సుమలత దంపతులు కొన్నేళ్ల క్రితం ఉపాధినిమిత్తం సజ్జలదిన్నెకు వచ్చారు. సమీపంలోని నాపరాళ్ల పరిశ్రమలో పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వీరికి ఇద్దరు కుమారులు కాగా పెద్ద కుమారుడు హర్షవర్ధన్. ఆదివారం స్నేహితులతో కలిసి ఈత కొట్టడానికి పెన్నాది ప్రాంతంలో ఉన్న నీటిగుంత వద్దకు వెళ్లాడు. ఈత నేర్చుకుంటుండగా గుంతలు ఉండడంతో హర్షవర్ధన్ లోపలికి వెళ్లాడు. గమనించిన తోటి స్నేహితులు గట్టిగా కేకలు వేశారు. సమీపంలోని తోటల యజమానులు నీటిగుంతలోకి దిగి హర్షవర్ధన్‌ను బయటకు తీశారు. చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందాడని నిర్ధారించారు.

వ్యాన్‌ను ఢీకొన్న ట్రావెల్స్ బస్సు

● 11 మందికి గాయాలు





ప్రమాదంలో దెబ్బతిన్న వ్యాన్ వెనుకభాగం, ట్రావెల్స్ బస్సు

గార్లదిన్నె, సెప్టెంబరు 29: మండలంలోని తలగాసిపల్లి క్రాస్ వద్ద 44వ జాతీయ రహదారిపై ఆదివారం తెల్లవారుజామున వ్యాన్‌ను వెనుక నుంచి ట్రావెల్స్ బస్సు ఢీకొన్న ప్రమాదంలో 11 మంది గాయపడ్డారు. తెలంగాణ రాష్ట్రం వనపర్తి జిల్లా బోసుపూర్ మండలం కొత్తకోటపాళ్యం గ్రామానికి చెందిన గౌతమ్ కుమార్, జ్యోతి దంపతులు స్వగ్రామం నుంచి కూలీలను పనుల నిమిత్తం బెంగళూరుకు తీసుకెళ్తుండేవారు. అందులో భాగంగా గౌతమ్‌కుమార్, జ్యోతి 11 నెలలు క్రితం సుమారు 25 మంది కూలీలను బెంగళూరులో అపార్టుమెంట్, రోడ్ల నిర్మాణ పనులకు తీసుకెళ్లారు. దసరా పండుగ దగ్గర పడుతుండడంతో అందరూ స్వగ్రామానికి శనివారం రాత్రి బెంగళూరు నుంచి వ్యాన్‌లో బయల్దేరారు. ఆదివారం తెల్లవారుజామున 2:30 గంటల సమయంలో గార్లదిన్నె మండలం తలగాసిపల్లి క్రాస్ వద్దకు రాగానే బెంగళూరు నుంచి హైదారాబాద్ వైపు వెళ్తున్న ఏపీఎం ట్రావెల్స్ బస్సు వ్యాన్ వెనుక నుంచి ఢీకొట్టింది. వ్యాన్‌లోని గౌతమ్‌కుమార్, జ్యోతి, లక్ష్మి, జయమ్మ, శ్రీనాథ్, చంద్రాయుడు, బస్సు క్లీనర్ ప్రమోద్, మరో నలుగురు గాయపడ్డారు. ఎస్ఐ మహమ్మద్ గౌస్.. సిబ్బందితో ప్రమాద స్థలానికి చేరుకుని, గాయపడిన వారిని 108 వాహనంలో అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. బస్సులో సుమారు 50 మంది ప్రయాణికులు ఉండగా.. వారంతా క్షేమంగా బయటపడ్డారు. బస్సు డ్రైవర్ నవీన్ పరారీలో ఉన్నట్లు ఎస్ఐ తెలిపారు.

కరాటే జట్టు ఎంపిక



ఎంపికైన ఉమ్మడి జిల్లా కరాటే జట్టు

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 29: ఉమ్మడి జిల్లా ఎస్‌జీఎఫ్-19 కరాటే క్రీడాకారులను ఎంపిక చేశారు. కరాటే క్రీడాకారులను ఎంపిక చేసినట్లు ఎస్‌జీఎఫ్-19 ఉమ్మడి జిల్లా కార్యదర్శి లక్ష్మీనారాయణ ప్రకటించారు. కరాటే బాలుర విభాగంలో రియాజ్, షాబాజ్, మోహన్‌కృష్ణ, హరీష్, లోకేష్ ఎంపిక కాగా...బాలికల్లో బరీరా, నిఖిత, సిరి, నస్రీన్, మదిహ ఉన్నారు. ఎంపికైన క్రీడాకారులు అక్టోబరు మొదటి వారంలో రాజంపేటలో నిర్వహించే ఎస్‌జీఎఫ్-19 రాష్ట్ర స్థాయి కరాటే పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తారు.

ముగిసిన వివాదం

● ఏకమైన మూడు పార్టీలు
● పరిటాల ఇంట చర్చలు

ధర్మవరం, సెప్టెంబరు 29: ధర్మవరం మున్సిపల్ కమిషనర్ నియామకంపై ఎన్డీఏ కూటమిలో నెలకొన్న విభేదాలు తీవ్ర స్థాయిలో భగ్గుమన్నాయి. తెలుగుదేశంపార్టీ అభిప్రాయానికి భిన్నంగా బీజేపీ నాయకత్వం వ్యవహరించడమే రాద్ధాంతానికి కారణం. వైసీపీతో అంటకాగిన కమిషనర్‌ను నియమించడంతో టీడీపీలో ఆగ్రహావేశాలు కట్టలు తెంచుకున్నాయి. నెలరోజులుగా వివాదం నడుస్తుండగా మంత్రి సత్యకుమార్ సైతం కమిషనర్‌ను వెనుకేసుకుని రావడం అగ్గికి ఆజ్యం పోసినట్లయింది. దీంతో టీడీపీ శ్రేణులంతా ఏకమై ఎన్డీఏ కార్యాలయం ముందే ధర్నాకు దిగడంతో ఇది కాస్తా రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం రేకెత్తించింది. మంత్రి సత్యకుమార్‌ను సైతం అడ్డగించి కాన్వాయ్‌ను కదలకుండా చేశారు. తమ పార్టీ పైస్థాయి నుంచి ఎక్కడ ఇబ్బంది కలుగుతాయోనన్న ఆందోళన సత్యకుమార్ వర్గీయుల్లో వ్యక్తమైనట్లు తెలుస్తోంది. శనివారం టీడీపీ శ్రేణులు భారీ ఎత్తున నిర్వహించిన ధర్నాతో ఉలిక్కిపడిన బీజేపీ అధిష్ఠానం దిద్దుబాటు చర్యలు చేపట్టినట్లు సమాచారం. అదే రోజు రాత్రే అనంతపురంలోని పరిటాల ఇంట్లో అంతర్గతంగా సమావేశం నిర్వహించి భవిష్యత్తులో ఇలాంటివి పునరావృతం కాకుండా చర్చలు జరిపినట్లు తెలుస్తోంది. ఈ చర్చల పట్ల మూడు పార్టీలు సానుకూలంగా వ్యవహరించడంతోపాటు ప్రస్తుత వివాదాస్పద కమిషనర్‌ను సరెండర్ చేయాలన్న ఏకాభిప్రాయానికి వచ్చినట్లు తెలుస్తోంది. అందులో భాగంగానే మూడు పార్టీల నాయకులు ధర్మవరంలో మీడియా ముందుకు వచ్చి తామంతా ఒక్కటేనని, చిన్నచిన్న సంఘటనలు జరుగుతుంటాయని, సర్దుకుపోతాయంటూ మాట్లాడారు.

ఈ ఐక్యత కొనసాగేనా..?

ఎన్డీఏ కూటమిలో టీడీపీ, బీజేపీ వర్గాల మధ్య నెలకొన్న విభేదాలు తీవ్ర స్థాయిలో ముదరడం, చివరికి మంత్రి సత్యకుమార్‌యాదవ్ జోక్యం చేసుకోవడంతో బ్రేక్ పడింది. వీరి మధ్య విభేదాలు పూర్తిగా సమసిపోయాయా..? తాత్కాలికమేనా అన్న సందేహాలు కలుగుతున్నాయి. ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి మూడు పార్టీల మధ్య అంతర్గత విభేదాలు మొదలయ్యాయి. తమకు విలువ లేకుండా చేస్తున్నారంటూ టీడీపీ వర్గీయులు నేరుగా బీజేపీ కార్యాలయానికివెళ్లి కిందిస్థాయి సిబ్బందితో చర్చలు జరిపారు. ఇదే సమయంలో వివాదాస్పద కమిషనర్ మల్లికార్జునను నియమించుకోవడంతో అగ్నికి ఆజ్యం పోసినట్లయింది. కమిషనర్‌ను మున్సిపల్ కార్యాలయంలోకి రానివ్వకుండా టీడీపీ వర్గీయులు అడ్డుకుంటూ వస్తున్నారు. కమిషనర్ బాధ్యతగా పనిచేసే వ్యక్తి అని, రాజకీయ విమర్శలు వస్తుంటాయని, అటువంటివి పట్టించుకోబోమని, అతనే కొనసాగుతాడంటూ పాత్రికేయ సమావేశంలో మంత్రి పేర్కొనడంతో టీడీపీ శ్రేణులు అగ్గిమీద గుగ్గిలమయ్యాయి. దీంతో బీజేపీ కార్యాలయాన్ని ముట్టడించి, రోడ్డుపై ధర్నా చేయడంతో అది కాస్తా రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం రేకెత్తించింది. సమస్యలు తొలగిపోయాయని మూడు పార్టీల నాయకులు బాహాటంగా చెబుతున్నప్పటికి ఇది తాత్కాలికమా లేదా ఐదేళ్లు కొనసాగుతుందా అన్నది ఆసక్తి రేపుతోంది.



మాట్లాడుతున్న పరిటాల శ్రీరామ్, చిలకం మధుసూదన్‌రెడ్డి, సందిరెడ్డి శ్రీనివాసులు

కూటమిలో విభేదాల్లేవ్

● మున్సిపల్ కమిషనర్‌తో గతంలో ఇబ్బందులు పడ్డాం
● పరిశీలిస్తామని సత్యకుమార్ చెప్పారు: పరిటాల శ్రీరామ్

ధర్మవరం, సెప్టెంబరు 29: ధర్మవరం కూటమిలో ఎలాంటి విభేదాలులేవని, మూడు పార్టీల లక్ష్యం నియోజకవర్గ అభివృద్ధి అని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్, జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి, బీజేపీ అనంతపురం జిల్లా అధ్యక్షుడు సందిరెడ్డి శ్రీనివాసులు స్పష్టం చేశారు. ఆదివారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పరిటాల శ్రీరామ్ మాట్లాడుతూ కూటమిలో ఎలాంటి విభేదాలు లేవని, కమిషనర్ నియామకంపై తమకు అభ్యంతరాలు ఉన్నాయన్నారు. గతంలో ఆయన కమిషనర్‌గా పనిచేసిన సమయంలో వైసీపీకి అనుకూలంగా వ్యవహరించి టీడీపీ నేతలను ఇబ్బంది పెట్టారని, ఇదే అంశాన్ని మంత్రి సత్యకుమార్ దృష్టికి తీసుకెళ్లామని అన్నారు. ఈ విషయాలు ఏవీ తనకు తెలియవని సత్యకుమార్‌కు చెప్పినట్టు వివరించారు. అన్ని అంశాలను పరిశీలించి తగిన నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చినట్టు చెప్పారన్నారు. ఎన్నికల ముందు తాము ఎలా కలిసి ఉన్నామో ఇప్పుడు అలాగే కలిసి ఉన్నామని స్పష్టం చేశారు. ధర్మవరాన్ని అభివృద్ధి చేయడమే తమ ముందున్న లక్ష్యం అన్నారు. మొదట ఆరునెలలు చిన్న చిన్న సంఘటనలు ఉంటాయని, అధికారులు, నాయకులంతా సమన్వయం చేసుకోవడానికి సమయం పడుతుందన్నారు. గతంలో జరిగిన భూకబ్జాలు, అక్రమాలు గురించి సత్యకుమార్‌కు చెప్పామని, వాటిన్నింటిపై చర్యలు ఉంటాయన్నారు. చిలకం మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ మున్సిపల్ కమిషనర్ నియామకం ఉద్దేశ్యపూర్వకంగా జరిగిందికాదని, దీనిని అడ్డుపెట్టుకుని తమ మధ్య విభేదాలు ఉన్నట్టు చిత్రీకరిస్తున్నారన్నారు. కమిషనర్ గతంలో తమ వాళ్లను ఇబ్బంది పెట్టారని, కార్యకర్తలు, నాయకులకు ఆయన రావడం ఇష్టం లేదన్నారు. సందిరెడ్డి శ్రీనివాసులు మాట్లాడుతూ కూటమి పార్టీల మధ్య విభేదాలు, అపోహలు వస్తే చూసి సంతోషించే వారు చాలా మంది ఉన్నారని అన్నారు. తాము వారికి అలాంటి అవకాశం ఇవ్వబోమన్నారు. కచ్చితంగా పునరాలోచించి కమిషనర్ అంశంపై తగిన నిర్ణయం తీసుకుంటామన్నారు. సమావేశంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కమతం కాటమయ్య, నాయకులు పరిశే సుధాకర్, పురుషోత్తంగౌడ్, మహేశ్‌చౌదరి, ఫణికుమార్, సంధారాఘవ, ప్రసాద్‌నాయుడు, నాగూర్‌హుస్సేన్, మాధవరెడ్డి, ఆది, పురుషోత్తం పాల్గొన్నారు.

పాలకుల స్వభావం మారితేనే సమసమాజం

● లెనిన్ శతవర్ధంతి సభలో వీకే రామచంద్రన్



లెనిన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వీకే రామచంద్రన్, వామపక్ష నాయకులు

అనంతపురం కల్చరల్, సెప్టెంబరు 29: అధికార మార్పిడి జరిగినంత మాత్రాన సమసమాజ స్థాపన సాధ్యం కాదని, పాలకవర్గ స్వభావంలోనే మార్పు రావాలని కేరళ ప్రభుత్వ ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు ఆచార్య వీకే రామచంద్రన్ పేర్కొన్నారు. లెనిన్ శతవర్ధంతిని పురస్కరించుకుని ఆదివారం జిల్లా కేంద్రంలో సీపీఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో 'రాజ్యం-విప్లవం' అనే అంశంపై మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ అధ్యక్షతన నిర్వహించిన సదస్సుకు రామచంద్రన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నేటి పెట్టుబడిదారీ వ్యవస్థలో పేద, ధనికుల మధ్య అంతరాలు అనివార్యమని కారల్ మార్క్స్, లెనిన్ ఆనాడే తమ రచనల ద్వారా తెలియజేసారని గుర్తుచేశారు. పాలకవర్గాలన్నీ పెట్టుబడిదారుల ప్రయోజనాలను కాపాడేందుకే పనిచేస్తాయని పేర్కొన్నారు. అందుకే ఈ సమాజంలో ఆర్థిక అసమానతలు అధికమని వివరించారు. స్వాతంత్ర్యానికి పూర్వం సమసమాజ భావనలే అధికంగా ఉండేవన్నారు. క్రమంగా బడా పెట్టుబడి, భూస్వామ్య లక్షణాలు పెరిగాయన్నారు. 1991లో సరళీకరణ ఆర్థిక విధానాలు అమలు చేయడం ప్రారంభించాక మరింత వేగవంతమయ్యాయన్నారు. దీనికి మతతత్వం కూడా తోడైందని తెలిపారు. అప్పటి నుంచి ఆర్థిక అంతరాలు మరింతగా పెరుగుతూ పోతున్నాయన్నారు. ప్రతి నలుగురు చిన్నారుల్లో ముగ్గురికి సరైన పౌష్టికాహారం లభించడం లేదని తెలిపారు. కార్మికులు కనీస వేతనాలకు నోచుకోవడం లేదని పేర్కొన్నారు. ఈ అంతరాలు పోవాలంటే పాలకవర్గాల స్వభావం మారాలన్నారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్ మాట్లాడుతూ నేటి పరిస్థితుల్లో లెనిన్ ఆలోచనలను మరోమారు పునరుచ్ఛరణ చేసుకోవాల్సిన అవసరముందన్నారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర నాయకుడు ఓబులు, ఐద్వా రాష్ట్ర కోశాధికారి సావిత్రి, డాక్టర్ భానుకిరణ్, ఎస్ఎం బాషా, గోవిందరాజులు, సత్యబోస్, నాగేంద్రకుమార్, రాజమోహన్, రమణయ్య, సతీష్, రంగనాయకులు, సత్యనారాయణరెడ్డి, రామాంజనేయులు, చంద్రశేఖర్‌రెడ్డి, వెంకటనారాయణ, రామిరెడ్డి, పరమేష్, జయచంద్ర, శ్రీదేవి, రమకృష్ణారెడ్డి, మనోహర్, ఇర్ఫాన్, శ్యామల పాల్గొన్నారు.

వయనాడ్ బాధితులకు రూ.17వేలు ఆర్థికసాయం: కేరళలోని వయనాడ్ వరద బాధితుల సహాయార్థం విద్యార్థుల నుంచి సేకరించిన రూ.17వేల చెక్కును కేరళ ముఖ్యమంత్రి రిలీఫ్ ఫండ్ పేరిట కేరళ రాష్ట్ర ప్రభుత్వ ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు వీకే రామచంద్రన్‌కు సమాజక్రాంతి చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకుడు లెనిన్‌బాబు అందజేశారు. దీనికి వీకే రామచంద్రన్ స్పందిస్తూ తాను కేరళ ముఖ్యమంత్రిని నేరుగా కలిసి ఈ చెక్కును అందజేస్తానని తెలిపారు.

పప్పుశనగ పంపిణీ ఎప్పుడో..?

● ఖరారుకాని టెండర్లు
● నల్లరేగడి రైతుల ఎదురుచూపులు
● రేపటి నుంచి రబీ సీజన్



అనంతపురం అర్బన్, సెప్టెంబరు 29: రబీ సీజన్ అక్టోబరు ఒకటో తేదీ నుంచి ప్రారంభం కానుంది. ఈ సీజన్‌లో జిల్లాలోని నల్లరేగడి భూముల్లో రైతులు పప్పుశనగ పంటను సాగు చేస్తూ వస్తున్నారు. ఇప్పటికే సేద్యం పనులు పూర్తి చేసుకున్నారు. వర్షం వస్తే పప్పుశనగ పంట సాగు చేసేందుకు రైతులు సిద్ధంగా ఉన్నారు. ప్రతి ఏడాది ప్రభుత్వం సబ్సిడీ రూపంలో రైతులకు పప్పుశనగ విత్తనాలు పంపిణీ చేస్తోంది. ఈ సారి ఇప్పటి దాకా పప్పుశనగ సబ్సిడీ ధరలు ఖరారు చేయలేదు. ఇంత వరకు రాష్ట్ర స్థాయిలో పప్పుశనగ సరఫరా కోసం టెండర్లు ఖరారు చేయకపోవడంతో ఎప్పటిలోగా విత్తనాలు పంపిణీ చేస్తారో తెలియని అయోమయంలో రైతులు కొట్టుమిట్టాడుతున్నారు.

సబ్సిడీ ధరలు ఖరారు చేసేదెన్నడో..?: ఈ ఏడాది జిల్లాకు 27,139 క్వింటాళ్ల పప్పుశనగ విత్తనాలు కేటాయించారు. గతేడాది సెప్టెంబరు 25వతేదీ సబ్సిడీ ధరలు ఖరారు చేశారు. ఆ మరుసటి రోజు నుంచి రైతు సేవా కేంద్రాల్లో పప్పుశనగ విత్తనాల కోసం రైతుల పేర్లు నమోదు చేశారు. ఈసారి ఇప్పటి దాకా రాష్ట్ర స్థాయిలో పప్పుశనగ సరఫరా కోసం టెండర్లు ఖరారు చేయలేదు. సంబంధిత రాష్ట్ర ఉన్నతాధికారులు నిర్లక్ష్యమే ఇందుకు కారణమన్న వాదనలు వినిపిస్తున్నాయి. గత ఏడాది ఏడాది రబీ సీజన్‌లో జిల్లాకు 27,266 క్వింటాళ్ల పప్పుశనగ కేటాయించారు. అప్పట్లో క్వింటాలు పూర్తి ధర రూ.8100గా నిర్ణయించారు. ఇందులో 40 శాతం సబ్సిడీ రూ.3240 పోను రైతు వాటా మొత్తం రూ.4860 చెల్లించేలా నిర్ణయం తీసుకున్నారు. ఈసారి ఎంత శాతం సబ్సిడీ నిర్ణయిస్తారో తెలియాల్సి ఉంది.

రేపటి నుంచి రబీ సీజన్ ప్రారంభం: అక్టోబరు 1 నుంచి రబీ సీజన్ ప్రారంభం కానుంది. ఈ ఏడాది రబీ సాధారణ సాగు విస్తీర్ణం 1.18 లక్షల హెక్టార్లుగా నిర్ణయించారు. ఇందులో పప్పుశనగ 72వేల హెక్టార్లు, మిగతా విస్తీర్ణంలో జొన్న, మొక్కజొన్న, వేరుశనగ తదితర రకాల పంటలు ఉన్నాయి. గత ఏడాది రబీ సీజన్‌లో జిల్లా వ్యాప్తంగా 82వేల హెక్టార్లల్లో వివిధ రకాల పంటలు సాగు చేశారు. ఇందులో అత్యధికంగా 49వేల హెక్టార్లల్లో పప్పుశనగ సాగు చేశారు. ఈసారి ఆశించిన స్థాయిలో వానలు పడితే సాధారణ సాగు విస్తీర్ణంలో పంటలు సాగయ్యే అవకాశం ఉందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

టెండర్లు ఖరారు చేయలేదు



పప్పుశనగ సరఫరా కోసం రాష్ట్ర స్థాయిలో ఇంకా సబ్సిడీ ధరలు ఖరారు చేయలేదు. టెండర్లు పూర్తి కాగానే సబ్సిడీ ధరలు నిర్ణయిస్తారు. జిల్లాకు 27,139 క్వింటాళ్ల పప్పుశనగ విత్తనాలు కేటాయించారు. సబ్సిడీ ధరలు ఖరారుకాగానే రైతు సేవా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ ప్రక్రియను ప్రారంభించి, నిర్దేశించిన సమయంలోగా పంపిణీకి చర్యలు తీసుకుంటాం.

- ఉమామహేశ్వరమ్మ, జిల్లా వ్యవసాయ అధికారి

సొమ్ము స్వాహాపై ఫిర్యాదు

● డీఆర్‌డీఏ ఉద్యోగులపై ఎఫ్ఐఆర్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 29: పలువురు డీఆర్‌డీఏ-వెలుగు ఉద్యోగులపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఆంధ్రజ్యోతిలో శనివారం ప్రచురితమైన 'స్వాహా సొమ్ము అంతేనా' కథనానికి డీఆర్‌డీఏ-వెలుగు అధికారులు స్పందించారు. ఈ మేరకు కళ్యాణదుర్గం ఏరియా కోఆర్డినేటర్ రాధారాణి అక్కడి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆ మేరకు కళ్యాణదుర్గం పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఇందులో డీఆర్‌డీఏ-వెలుగు సిబ్బంది లక్ష్మీనరసమ్మ, ఎర్రిస్వామి, వరలక్ష్మి, హనుమంతరాయుడు, లక్ష్మీదేవిని నిందితులుగా చేర్చారు. కళ్యాణదుర్గం మండలం మల్లికార్జునపల్లిలో నరసింహస్వామి గ్రామైక్య సంఘంలో 22 స్వయం సహాయక సంఘాల్లో స్త్రీనిధి మంజూరు చేశారు. సుమారు రూ. 72,41,307 నిధులు దుర్వినియోగమయ్యాయని పీడీ తెలిపారు. ఇందులో బ్యాంకు లింకేజీ రూ.48 లక్షలు, స్త్రీనిధి రూ.18.85 లక్షలు, పొదుపు సొమ్ము రూ.2.68 లక్షలు, ఉన్నతి రూ.46వేలు, సీఐఎఫ్ రూ.50వేలు, ఇతర సంఘాల నుంచి నిధుల మళ్లింపు రూ.1.81 లక్షలు దుర్వినియోగానికి పాల్పడ్డారు. సంబంధిత సిబ్బందిపై క్రిమినల్ కేసు నమోదు చేశారని, సొమ్ము మొత్తాన్ని రికవరీ చేస్తామని తెలిపారు.

భారీగా పెరిగిన సంత ఆదాయం

అనంతపురంరూరల్, సెప్టెంబరు 29: అనంతపురం వ్యవసాయ మార్కెట్‌కు ఈవారం పశువుల సంత ద్వారా భారీ ఆదాయం సమకూరింది. గత వారం రూ.4.49 లక్షలు ఆదాయం వచ్చింది. ఆ ఆదాయం మరింత పెరిగింది. ఈ వారం ఏకంగా రూ.5లక్షలు దాటింది. రెండు రోజుల పశువుల సంతతో రూ.5,91,480 వచ్చింది. అక్టోబరు 2న అమావాస్య కారణంగా ఆదాయం పెరిగినట్లు తెలుస్తోంది. పశువుల సంత నుంచి ఇంతస్థాయిలో ఆదాయం ఇదే మొదటి సారి అని సంబంధిత వర్గాలు తెలిపాయి. ఈ వారం ఎద్దులు, ఎనుముల సంత కంటే గొర్రెలు, మేకల సంత ద్వారా ఆదాయం ఎక్కువగా వచ్చింది. శనివారం జరిగిన గొర్రెలు, మేకల సంత ద్వారా మార్కెట్‌కు రూ.3,42,370, ఆదివారం జరిగిన ఎనుములు, ఎద్దులు, ఆవుల సంతతో రూ.2,49,110 వచ్చినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి గోవిందు ఆదివారం తెలిపారు.

చిన్నకదరయ్యస్వామి హుండీ లెక్కింపు

రాప్తాడు, సెప్టెంబరు 29: మండలంలోని మరూరు గ్రామంలో వెలసిన చిన్నకదరయ్యస్వామి ఆలయ హుండీ ఆదాయాన్ని ఆదివారం లెక్కించారు. ఆలయ ప్రాంగణంలో రాప్తాడు సీఐ హర్ష, తహసీల్దార్ విజయకుమారి, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్థుల సమక్షంలో హుండీ ఆదాయం లెక్కించారు. రూ. 7.82 లక్షలు ఆదాయం వచ్చినట్లు వారు తెలిపారు. హుండీ ఆదాయాన్ని చిన్నకదరయ్యస్వామి ఆలయ అభివృద్ధికి ఉపయోగిస్తామని తెలిపారు.

గన్‌మెన్‌ను వెనక్కు పంపిన ఎమ్మెల్యే దగ్గుపాటి

అనంతపురం క్రైం, సెప్టెంబరు 29: ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ఆదివారం రాత్రి తన గన్‌మెన్‌ను వెనక్కు పంపారు. కారణాలు తెలియరాలేదు. ఈ విషయంపై పోలీస్ అధికారుల నుంచి సైతం స్పష్టమైన సమాధానాలు రాలేదు.

రేపు చెకుముకి మండలస్థాయి సంబరాలు

అనంతపురం కల్చరల్, సెప్టెంబరు 29: జనవిజ్ఞాన వేదిక(జేవీవీ) ఆధ్వర్యంలో మంగళవారం జిల్లాకేంద్రంలోని కేఎస్ఆర్ బాలికల ఉన్నత పాఠశాలలో మండలస్థాయి చెకుముకి సైన్స్ సంబరాలు నిర్వహించనున్నట్లు జేవీవీ నగరాధ్యక్షుడు రామిరెడ్డి, చెకుముకి కన్వీనర్ రామకృష్ణ ఆదివారం సంయుక్త ప్రకటనలో వెల్లడించారు. కార్యక్రమానికి డీఈఓ వరలక్ష్మి ముఖ్యఅతిథిగా హాజరై సంబరాలను ప్రారంభిస్తారన్నారు. ఈనెల 25న 40 పాఠశాలల్లో చెకుముకి సంబరాలు నిర్వహించామని, మండలస్థాయి సంబరాల్లోనూ ఆయా పాఠశాలల విద్యార్థులు పాల్గొంటారని వారు పేర్కొన్నారు.

మదరసా ప్రారంభం

అనంతపురం క్రైం, సెప్టెంబరు 29: నగరంలోని గుల్జార్‌పేటలో నూతనంగా ఏర్పాటు చేసిన మదరసా యే ఆయేషా నిశ్వాన్‌ను ఆదివారం ప్రారంభించారు. కార్యక్రమానికి ఆల్ ఇండియా జనరల్ సెక్రటరీ జమీయల్ ఉల్‌మాయే హింద్, ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త హజరత్ ముఫ్తి సయ్యద్ మాసూమ్ సాఖిబ్ సాహెబ్, నగర మేయర్ మహమ్మద్ వసీం సలీం హాజరయ్యారు. ముస్లిం చిన్నారులకు చిన్నతనం నుంచే ఖరాన్ పఠనం అలవాటు చేయాలని సూచించారు.

3 నుంచి ఉచిత క్రికెట్ శిక్షణ శిబిరం

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 29: స్థానిక కొడిమి జర్నలిస్టు కాలనీలో అక్టోబరు 3వ తేదీ నుంచి ఉచిత క్రికెట్ శిక్షణా శిబిరం ప్రారంభించనున్నట్లు ఏపీ స్పోర్ట్స్ డెవలప్‌మెంట్ ట్రస్టు చైర్మన్ మచ్చా రామలింగారెడ్డి తెలిపారు. విజయదశమి పురస్కరించుకుని ప్రారంభించే ఉచిత క్రికెట్ శిక్షణ శిబిరాన్ని జిల్లా వ్యాప్తంగా ఉన్న జర్నలిస్టుల పిల్లలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు సెల్ నంబరు 9490062555ను సంప్రదించాలని కోరారు.

సత్ప్రవర్తనతో మెలగండి: ఎస్ఐ

చెన్నేకొత్తపల్లి, సెప్టెంబరు 29: గ్రామాల్లో ఎలాంటి గొడవల జోలికి వెళ్లకుండా సత్ప్రవర్తనతో మెలగాలని ఎస్ఐ సత్యనారాయణ సూచించారు. ఆయన ఆదివారం మండలంలోని రౌడీషీటర్లకు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ... గ్రామాల్లో శాంతిభద్రతలకు భంగం కల్గించిన వారిపై కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతినిత్యం అందరిపై పోలీసు నిఘా ఉంటుందన్నారు. కావున ఎలాంటి గొడవల జోలికి వెళ్లకుండా ప్రశాంతంగా జీవించాలని వారికి సూచించారు.

యువతి అదృశ్యం

అనంతపురం క్రైం, సెప్టెంబరు 29: కళాశాల వద్దకు వెళ్తున్నానని చెప్పి ఇంటి నుంచి వెళ్లిన ఓ యువతి అదృశ్యమైనట్లు కేసు నమోదు చేశామని అనంతపురం రూరల్ పోలీసులు తెలిపారు. పాపంపేటకు చెందిన షబ్రీన్ అనే యువతి ఇంటర్ పూర్తి చేసింది. ఆమె శనివారం(ఈనెల 28వతేదీ) ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని పీవీకేకే కళాశాలలో డిగ్రీ కోసం దరఖాస్తు చేయడానికి వెళ్తున్నానని చెప్పి ఇంటి నుంచి బయ లుదేరింది. రాత్రయినా ఇంటికి రాకపోవడంతో ఆందోళన చెందిన కుటుంబసభ్యులు బంధువుల ఇళ్లల్లో ఆరాతీశారు. ఆచూకీ తెలియక పోవడంతో షబ్రీన్ తల్లి హజరా అనంతపురం రూరల్ పోలీస్‌స్టేషన్ లో ఆదివారం ఫిర్యాదు చేసింది.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్రగాయాలు

అనంతపురం క్రైం, సెప్టెంబరు 29: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఓ యువకుడి పరిస్థితి విషమంగా ఉంది. నగరంలోని ఆజాద్‌నగర్‌కు చెందిన విజయభాస్కర్‌రెడ్డి ఆదివారం తన స్నేహితుడితో కలిసి బైక్‌లో వ్యక్తిగత పనిమీద బయటకెళ్లాడు. కక్కలపల్లి క్రాస్ సమీపంలో బైక్ స్కిడ్ కావడంతో కిందపడిన విజయభాస్కర్‌రెడ్డి తలకు తీవ్రగాయం కావడంతో స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రస్తుతం అతడి పరిస్థితి విషమంగా ఉందని వైద్య వర్గాలు తెలిపాయి.

విద్యుదాఘాతంతో రైతు మృతి


చిరంజీవి మృతదేహం

రాప్తాడు, సెప్టెంబరు 29: మండలంలోని బోగినేపల్లికి చెందిన రైతు చిరంజీవి (37) ఆదివారం ఉదయం విద్యుదాఘాతంతో మృతి చెందాడు. స్టార్టర్ పెట్టెను తాకినపుడు విద్యుత్‌షాక్ తగిలి, అక్కడికక్కడే మృతి చెందినట్లు గ్రామస్థులు తెలిపారు. బోగినేపల్లికి చెందిన చిన్నమాదన్న కుమారుడు చిరంజీవి వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగించేవాడు. గ్రామంలో ఆదివారం ఉదయం వర్షం కురిసింది. చిరంజీవి తన తోటలోని విద్యుత్ మోటారు ఆఫ్ చేయడానికి వెళ్లాడు. అక్కడి స్టార్టర్ పెట్టెను తాకగా విద్యుదాఘతంతో అక్కడికక్కడే మృతి చెందాడు. దీంతో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంతమయ్యారు. రాప్తాడు పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు. మృతుడు చిరంజీవికి ఇంకా వివాహం కాలేదని గ్రామస్థులు తెలిపారు.

మరొకరు...

కణేకల్లు: మండలంలోని యర్రగుంట గ్రామానికి చెందిన పోతప్ప(36) విద్యుత్‌షాక్‌తో మృతి చెందాడు. పోత ప్ప గ్రామంలో ఎలెక్ట్రీషియన్ పనులు చేస్తూ జీవనం సాగించేవాడు. ఆదివారం గోపులాపురంలో ఉన్న ఓ ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతు పనులు చేస్తుండగా.. విద్యుత్‌షాక్ తగలడంతో కింద పడ్డాడు. స్థానికులు ఆర్టీటీ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం రాయదుర్గం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ రాత్రి మృతి చెందాడు. మృతుడికి భార్యతో పాటు ఇద్దరు సంతానం ఉన్నారు.

పార్టీకి కార్యకర్తలే గట్టి పునాదులు

● బీజేపీ జిల్లా అధ్యక్షుడు సందిరెడ్డి శ్రీనివాసులు


శ్రీనాథ్‌ను బీజేపీలోకి ఆహ్వానిస్తున్న సందిరెడ్డి శ్రీనివాసులు

అనంతపురం సెంట్రల్, సెప్టెంబరు 29 : గ్రామస్థాయిలో పార్టీ బలోపేతానికి కార్యకర్తలే గట్టిపునాదులని బీజేపీ జిల్లా అధ్యక్షుడు సందిరెడ్డి శ్రీనివాసులు పేర్కొన్నారు. నగరంలో పలువురు ఆదివారం స్థానిక బీజేపీ జిల్లా కార్యాలయంలో ఆ పార్టీలో చేరారు. ముఖ్యఅతిథిగా హాజరైన సందిరెడ్డి శ్రీనివాసులు మాట్లాడుతూ... ప్రధాని నరేంద్ర మోదీ పదేళ్ల పాలనతో సామాన్య ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడ్డాయన్నారు. ఈ నేపథ్యంలో ఇతర పార్టీల నాయకులు, కార్యకర్తలు బీజేపీలో పనిచేయడానికి తరలివస్తున్నారని తెలిపారు. అనంతరం పాతూరుకు చెందిన సీపీఐ నాయకుడు వడ్డె శ్రీనాథ్‌తో పాటు దాదాపు 300 మందికి కండువావేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎలాగూ మార్చేస్తారు... బియ్యం అమ్మేద్దాం..!

● పలువురు రేషన్ డీలర్ల తీరు
● ఆవేదన వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులు


నార్పల తహసీల్దారు కార్యాలయం

నార్పల, సెప్టెంబరు29: టీడీపీ ప్రభుత్వం వచ్చింది... మనల్ని ఎప్పుడు మారుస్తారో తెలియదు... ఉన్నన్ని నెలల్లో ఏదో కొంత మందికి రేషన్ బియ్యం ఇచ్చి మిగితా వారికి ఇవ్వకుండా పక్కదారి పట్టించినా పట్టించుకునేవా లేరు అన్న ధోరణిలో పలువురు రేషన్ డీలర్లు వ్యవహరిస్తున్నారు. నార్పల మండల వ్యాప్తంగా 52మంది రేషన్ డీలర్లు ఉన్నారు. అయితే టీడీపీ ప్రభుత్వం వచ్చి మూడు నెలలు అవుతోంది. కానీ ఇప్పటికీ వైసీపీకి చెందిన రేషన డీలర్లే కొనసాగుతున్నారు. అయితే వారు మమ్మల్ని ఎలాగూ తొలగి స్తారు అన్న ఉద్దేశంతో ప్రతి నెల బియ్యం సగం మందికి పైగా ఇవ్వకుండా తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారు. కొంత మంది డీలర్లు అయితే తమ వద్ద బియ్యం లేవని వేరే డీలర్ వద్దకు వెళ్లమని చెబుతున్నారు. అక్కడికి వెళ్తే తమ వద్ద కూడా స్టాక్ లేదని చెబుతూ తమను కాళ్లు అరిగేలా తిప్పుతున్నారని పలువురు లబ్ధిదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మరో కొంత మంది లబ్ధిదారులు దీనిపై అధికారులకు ఫిర్యాదు చేశారు. కానీ ఒక రెవెన్యూ అధికారి మాత్రం ఎలాగూ ఈనెల నుంచి ఆ డీలర్లు ఉండరు ఈ నెల ఒకటి సర్దుకోమని ఉచిత సలహాలు ఇస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉంటే కొందరు డీలర్లు లబ్ధిదారులకు బియ్యం ఇవ్వకుండా బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తున్నట్లు సమాచారం. మండలంలో నిరుపేదలకు అందాల్సిన బియ్యాన్ని కొందరు డీలర్లు మూడు నెలల నుంచి అమ్ముకుంటూ సొమ్ము చేసుకుంటున్నా ప్రజా ప్రతినిధులు, అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదని మండల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అంతే కాకుండా రేషన్ బియ్యాన్ని ఇంటింటికీ సరఫరా చేయడంలేదు. ఎండీయూ వాహనాల్లో గ్రామాల్లోకి తీసుకొచ్చి బస్టాండ్, తదితర ప్రాంతాల్లో కొంతసేపు కాలంగడిపి అక్కడి నుంచి వెళ్లిపోతున్నారు. ఇలా లబ్ధిదారులకు బియ్యం అందక పో వడంపై సీపీఐ మండల నాయకుడు ప్రవీణ్ అధికారులకు ఫిర్యాదు కూడా చేశారు. అయినప్పటికీ అధికారులు ఏమాత్రం స్పందించకపోవడం గమనా ర్హమని ఆయన అంటున్నాడు. ఇప్పటికైనా ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ, సంబంధిత ఉన్నత స్థాయి అధికారులు చొరవ తీసుకొని రేషన్ బియ్యం సక్రమంగా పంపిణీ చేయించాలని మండల ప్రజలు కోరుతున్నారు.


నార్పల బస్టాండ్‌లో బియ్యం ఇస్తున్న దృశ్యం (ఫైల్)

రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశాం



రేషన్ బియ్యాన్ని సక్రమంగా ఇవ్వడం లేదని గత నెలలోనే లబ్ధిదారులతో కలసి రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశాను. ఏ ఒక్క అధికారి కూడా పట్టించుకోలేదు. కానీ నేనే దగ్గరుండి చాలామంది డీలర్లతో వాగ్వాదం చేసి కొంత మంది నిరుపేదలకు బియ్యం ఇప్పించాను. అయినా చాలా మంది లబ్ధిదారులకు రేషన్ బియ్యం అందడం లేదు. అలా మిగిలిన బియ్యాన్ని బ్లాక్ మార్కెట్ తరలిస్తున్నారు. **- గంగాధర్, సీపీఐ మండల కార్యదర్శి, నార్పల**

రేషన్ ఇవ్వకపోతే చర్యలు తీసుకుంటాం

నార్పల మండలంలో ఏ డీలర్ అయినా రేషన్ బియ్యం ఇవ్వకపోతే వెంటనే మాకు ఫిర్యాదు చేయాలి. బియ్యం వేయని డీలర్‌పై విచారణ చేసి చర్యలు చేపడతాం. **- అరుణకుమారి, తహసీల్దారు**

టీడీపీతోనే క్రిస్టియన్ల అభివృద్ధి

● టీడీపీ క్రిస్టియన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు స్వామిదాస్

అనంతపురం అర్బన్, సెప్టెంబరు 29: క్రిస్టియన్ల అభివృద్ధి టీడీపీతోనే సాధ్యమని క్రిస్టియన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు స్వామిదాస్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గుంటూరులోని క్రిస్టియన్ భవనం కోసం రూ.10 కోట్లను సీఎం చంద్రబాబు కేటాయించడం హర్షణీయమన్నారు. గతంలో టీడీపీ హయాంలోనే క్రిస్టియన్ భవనం నిర్మాణం కోసం రెండెకరాలు కేటాయించారని అన్నారు. అలాగే రూ.16 కోట్ల నిధులు విడుదల చేసి, 90 శాతం పనులు పూర్తి చేశారన్నారు. గత వైసీపీ పాలనలో పెండింగ్‌లోని 10 శాతం పనులు పూర్తి చేయలేదని విమర్శించారు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వంలో సీఎం చంద్రబాబు పెండింగ్ పనులు పూర్తికి చర్యలు తీసుకుంటున్నారన్నారు. క్రైస్తవులకు పవిత్ర పుణ్యక్షేత్రం జెరూసలెం యాత్రకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టా లని అధికారులను ఆదేశించారని ఆయన పేర్కొన్నారు.

తప్పుడు కథనాలు సరికాదు

● బీసీ ఉద్యోగులను ఇబ్బందిపెట్టాలని చూస్తే ఊరుకోం
● ఏపీ స్టూడెంట్ జేఏసీ జిల్లా అధ్యక్షుడు

అనంతపురం ప్రెస్‌క్లబ్, సెప్టెంబరు 29: బీసీ ఉద్యోగి అయిన సీఐ రాజేంద్రనాథ్‌పై వివాదాస్పద తీరుతో జగన్ సొంత పత్రికలో కథనాలు రాయడం సరికాదని ఏపీ స్టూడెంట్స్ జేఏసీ జిల్లా అధ్యక్షుడు అమర్ యాదవ్ అన్నారు. ఇలా బీసీ ఉద్యోగులను ఇబ్బందులపాలు చేయడం తగదన్నారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఆ సంఘం కార్యాలయంలో బీసీ సంక్షేమ సంఘం హిందూపురం పార్లమెంటు అధ్యక్షుడు చక్రధర్ యాదవ్, బీసీ ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షు డు అశ్వత్థతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఏం జరిగినా బీసీల మీద నెట్టడమే ధ్యేయంగా వైసీపీ నేతలు పెట్టుకున్నారన్నారు. అధికారంలో ఉన్నప్పుడు బీసీల పార్టీ అని చెప్పి... అధికారం పోయాక బీసీల మీద బురద జల్లుతారా అని ప్రశ్నించారు. వారి రాజకీయ లబ్ధి కోసం... బీసీలను వాడుకోవద్దని హెచ్చరించారు. బీసీ ఉద్యోగులను ఇబ్బందిపెట్టాలని చూస్తే ఎంతటి ఉద్యమాలకైనా వెనకాడమన్నారు. విద్యార్థి సంఘాల నాయకులు విజయ్, కుళ్లాయప్ప, సాయి, భరత్, నితిన్, గణేష్, తేజ, ఎర్రిస్వామి యాదవ్, వాల్మీకి సాయి వాల్మీకి పురుషోత్తం, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

క్రిమిసంహారక మందు ప్రభావంతో కౌలురైతు మృతి

కణేకల్లు, సెప్టెంబరు 29: మం డలంలోని మాల్యం గ్రామంలో గల ఎస్సీకాలనీకి చెందిన కౌలురైతు విజయ్‌కుమార్(30 క్రిమిసంహారక మందు ప్రభావంతో మృతి చెందాడు. విజయ్‌కుమార్ రెండెకరాల భూమిని కౌలుకు తీసుకుని వరిపంటను సాగు చేశాడు. ఆదివారం ఉదయం అతను పంటకు క్రిమిసంహారక మందును పిచికారీ చేసేందుకు వెళ్లాడు. మాస్క్ లేకుండా పిచికారీ చేయడంతో మందు తుంపరలు మొహాన పడ్డాయి. ఆ మందు వాసన పీల్చడంతో అపస్మారకస్థితికి చేరాడు. కుటుంబసభ్యులు కణేకల్లు ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్య అనంతపురం తరలించారు. అయితే అక్క డ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య శివమ్మతో పాటు నలుగురు కుమార్తెలు ఉన్నారు.

బీసీల బాంధవుడు చంద్రబాబు

● ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు


ఎమ్మెల్యే కాలవను సన్మానిస్తున్న పోతుల లక్ష్మీనరసింహులు

అనంతపురం అర్బన్, సెప్టెంబరు 29 : బీసీల బాంధవుడు సీఎం చంద్రబాబు నాయుడు అని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు, ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు పేర్కొన్నారు. నగరంలోని ఆయన నివాసంలో ఆదివారం పద్మశాలి కార్పొరేషన్ రాష్ట్ర సభ్యులు పోతుల లక్ష్మీనరసింహులు కాలవ శ్రీనివాసులుకు పుష్పగుచ్ఛం అందజేసి, శాలువ కప్పి సన్మానించారు. కష్టకాలంలో పార్టీ కోసం పనిచేసిన ప్రతి ఒక్కరికీ అధిష్టానం అవకాశం కల్పిస్తుందన్నారు. చిత్తశుద్ధితో పనిచేసి పార్టీకి మరింత మంచి పేరు తీసుకురావాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో పద్మ శాలి సంఘం నాయకులు సత్యనారాయణ, పోతుల మంజునాథ్, కురబ సంఘం నాయకులు కాశీ విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

పిడుగు పాటుకు 12 గొర్రెల మృతి

గుత్తిరూరల్, సెప్టెంబరు 29: మండలంలోని చెర్లోపల్లి గ్రామశివారులో ఆదివారం రాత్రి పిడుగు పడి 12 గొర్రెలు మృతి చెందా యి. గ్రామశివారులోని గుట్టపై గొర్రెల మందను నిలిపి ఉండగా.. రాత్రి ఉరుములు మెరుపులతో కూడిన గాలి వాన వచ్చిందని, ఈ క్రమంలో ఒక్కసారిగా తీగ మెరుపు మెరిసి గొర్రెల మందపై పిడుగు పడిందని, దీంతో 12 గొర్రెలు మృతి చెందాయని గొర్రెల కాపరులు లాలెప్ప, రాజశేఖర్, సుంకన్న, రామాంజనేయులు తెలిపారు. రూ.1.20 వేలు నష్టం వాటిల్లిందని వాపోయారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

ఆటో బోల్తా.. నలుగురికి గాయాలు

పుట్లూరు, సెప్టెంబరు 29: మండలంలోని ఏ. కొండాపురం గ్రామశివారులో ఆదివారం ఆటో బోల్తాపడి నలుగురికి గాయాలయ్యాయి. తాడిపత్రి నుంచి అనంతపురం వెళుతున్న ఆటో కొండాపురం వద్దకు రాగానే అదుపు తప్పి బోల్తాపడింది. ప్రమాదంలో ఆటోలో ఉన్న అనంతపురానికి చెందిన రామాంజి, నాగరాజు, బాషా, అంజికి స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు వారిని వెంటనే తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ విషయంపై ఫిర్యాదు రాలేదని పోలీసులు తెలిపారు.

స్కూటీ అపహరణ

యాడికి, సెప్టెంబరు 29: మండలకేంద్రంలోని కుం టలో ఆదివారం ఉదయం స్కూటీ అపహరణకు గురైంది. బాధితుడు మద్దిలేటి తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నా యి. స్థానంగా ఉన్న తన హోటల్ వద్ద ఆదివారం ఉద యం వ్యాపారంలో బిజీగా ఉన్నామని, ఆ సమయంలో ఆ పక్కనే పార్క్ చేసిన తన స్కూటీని గుర్తుతెలియని వ్యక్తులు అపహరించారని తెలిపారు. పట్టపగలే దుకాణం వద్ద స్కూటీని అపహరించారన్నారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసినటు చెప్పారు.

ఆటోనగర్‌లో దొంగల భయం

● రాత్రిళ్లు వాహన సామగ్రి ఎత్తుకెళ్తున్న దొంగలు
● ఆందోళన చెందుతున్న మెకానిక్‌లు


రాప్తాడులోని ఆటోనగర్

రాప్తాడు, సెప్టెంబరు 29: మండల కేంద్రంలోని ఆటోనగర్‌లో దొంగలు రెచ్చిపోతున్నారు. తరచూ రాత్రిళ్లు అక్కడి మెకానిక్ షాపుల్లోకి చొరబడి వాహనాల సామగ్రి ఎత్తుకెళ్లి, అమ్ముకుంటున్నారు. రిపేరీ కోసం వచ్చిన వాహనాల విలువైన సామగ్రిని దొంగలు ఎత్తుకెళ్తుండటంతో మెకానిక్‌లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాప్తాడులో 44వ జాతీయ రహదారి పక్కన 554-2 సర్వే నెంబర్‌లో 33 ఎకరాల్లో ఆటో నగర్ ఉంది. ద్విచక్రవాహనం మినహా మిగతా అన్ని వాహ నాల రిపేరీకి మెకానిక్ షాపులు ఉన్నాయి. వాహనాల రిపేరీకి కావాల్సిన అన్ని స్పేర్ పార్ట్స్ అక్కడే దొరుకుతాయి. జిల్లా నలు మూలల నుంచి రైతులు, ఇతర వాహనాల వారు ఇక్కడికి వచ్చి తమ వాహనాలు రిపేరీ చేయించుకుంటారు. ఇతర ప్రాంతాలకు చెందిన వారు కూడా వాహనాలు రిపేరీకి ఇక్కడకు వస్తారు. లారీలు, ట్రాక్టర్లు, ఐషర్లు, ఇతర భారీ వాహనాల రిపేరీ ఒక్కో సారి ఒక్క రోజు లో పూర్తికాదు. దీంతో ఆ వాహనం కొన్ని రోజుల పాటు మెకానిక్ షాపులోని ఉండాల్సి వస్తుంది. అయితే ఆటో నగర్‌లో ఇటీవల దొంగతనాలు ఎక్కువ య్యాయి. రాత్రి సమయంలో దొంగలు ముఖాలకు మాస్కులు వేసుకుని మె కానిక్ షాపుల్లోకి చొరబడి వాహనాల సామగ్రి ఎత్తుకెళ్తున్నారు. ట్రాక్టర్, ఐషర్ వాహనాలకు అమర్చిన బ్యాటరీలను విప్పి ఎత్తుకెళుతున్నారు. ఐషర్ వాహనం లోని డీజిల్ చోరీ చేస్తున్నారు. పాత టైర్లు, వాహనాల ఇతర విలువైన సామగ్రి ని కాజేస్తున్నారు. అటువంటప్పుడు ఆయా సామగ్రిని తాము కొనివ్వాల్సి వస్తోం దని మెకానిక్‌లు వాపోతున్నారు. ఆటో నగర్‌లో కొన్ని షాపులకు సీసీ కెమెరాలు ఉన్నప్పటికీ దొంగలు ముఖాలకు మాస్కులు వేసుకుని చోరీలు చేస్తున్నారు. గతంలో రాప్తాడు పోలీసులు రాత్రి సమయంలో ఆటో నగర్‌లో ర్యాండమ్‌గా గస్తీ నిర్వహించేవారు. అయితే ఇటీవల పోలీసులు గస్తీ నిర్వహించకపోవడంతో దొంగతనాలు ఎక్కువయ్యాయని మెకానిక్‌లు వాపోతున్నారు. ఆటో నగర్‌లో మరిన్ని సీసీ కెమెరాలు అమర్చడంతో పాటు, పోలీసులు గస్తీ నిర్వహిస్తే దొంగతనాలు జరగవని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. రాప్తాడు సీఐ శ్రీహర్ష మాట్లాడుతూ ఇటీవలే బదిలీపై రాప్తాడుకు వచ్చానని ఆటో నగర్‌లో దొంగతనాలు జరగకుండా చర్యలు తీసుకుంటామన్నారు. మెకానిక్ షాపుల్లో సీసీ కెమెరాలు అమర్చే విధంగా చర్యలు తీసుకుంటమన్నారు.

ట్రాక్టర్‌కు ఉన్న బ్యాటరీ ఎత్తుకెళ్లారు



పది రోజుల క్రితం మా షాప్‌లో దొంగ చొరబడ్డాడు. ట్రాక్టర్‌కు ఉన్న బ్యాటరీ ని విప్పి ఎత్తుకెళ్లాడు. అది దాదాపు రూ. 6 వేలు చేస్తుంది. రైతులు రిపేరీ కోసం వాహనాలు ఇక్కడ ఉంచితే దొంగలు ఎత్తుకెళ్లిన సామగ్రిని మేమే కట్టివ్వాల్సి వస్తోంది. నెల కిందట ట్రాక్టర్ ఇంజన్ హెడ్‌ను ఎత్తుకెళ్లారు.
-రిజ్వాన్‌బాషా, ట్రాక్టర్ మెకానిక్

200 లీటర్ల డీజిల్ ఎత్తుకెళ్లారు



దాదాపు 20 రోజుల కిందట మా షాప్‌లో ఉన్న ఐషర్ వాహనంలో డీజిల్ ఎత్తుకెళ్లారు. ప్రతి రోజు లాగే ఆ రోజు సాయంత్రం షాపు గేటుకు తాళం వేసి వెళ్లాను. ఐచర్ వాహనంలో 200 లీటర్ల డీజిల్‌ను క్యాన్‌లలోకి పట్టుకుని ఎత్తుకె ళ్లారు. దాదాపు రూ. 20 వేలు నష్టం. ఆర్నెల్ల కిందట మా పక్క షాపులో పాత టైర్లను ఎత్తుకెళ్లారు.
- టింకర్ పజిల్, ఐషర్ మెకానిక్

వ్యాన్ బ్యాటరీ అపహరించారు



మా షాప్‌లో ఇటీవల ఐషర్ వాహనంలో ఉన్న 30 లీటర్ల డీజిల్ కాజేశారు. కొన్ని నెలల కిందట ఉన్న ఐషర్ వాహనం బ్యాటరీ విప్పి ఎత్తుకెళ్లారు. ఆటో నగర్‌లో తరచు దొంగతనాలు జరుగుతున్నాయి. దీంతో మెకానిక్‌లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.
- సందాని, మెకానిక్

దసరా ఉత్సవాలను విజయవంతం చేయండి

● కొత్తూరు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు

అనంతపురం కల్చరల్, సెప్టెంబరు 29: కొత్తూరు వాసవీ కన్యకా పరమేశ్వరి దేవాలయంలో అక్టోబరు 3 నుంచి 13వ తేదీ వరకు నిర్వహించనున్న దేవీ నవరాత్రి ఉత్సవాలను విజయవంతం చేయాలని కొత్తూరు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు గోపా మచ్చా నరసింహులు పిలుపునిచ్చారు. ఆలయ ఆవరణలో ఆదివారం ఉత్సవాల బ్రోచర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గోపా మచ్చా నరసింహులు మాట్లాడుతూ... ఉత్సవాల్లో అమ్మవారి ప్రత్యేక అలంకరణల కోసం మన రాష్ట్రంతోపాటు తమిళనాడులోని సేలం నుంచి కళాకారులు హాజరవుతున్నట్లు తెలిపారు. అమ్మవారి మూల విరాట్‌తోపాటు కల్యాణమండపంలో ఉత్సవ మూర్తులకు రోజుకో అలంకారం చేసి పూజాకార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ నిర్వాహకులు పరుచూరు సూర్యప్రకాష్, మిట్టా ఆంజనేయులు, టంగుటూరు నాగభూషణం, కృష్ణం రఘు, తల్లం మురళి, కురిడి వెంకటేష్, సామ్రాట్, మధు, నిరంజన్ గుప్త, రత్నమయ్య, సృజన్, నిర్మలాదేవి, జయలక్ష్మి, లక్ష్మి, శోభారాణి, యువజన సంఘం, మహిళా మండలి సభ్యులు పాల్గొన్నారు.

ముగిసిన యూటీఎఫ్ క్రీడాపోటీలు


చెస్ పోటీల్లో పాల్గొన్న మహిళా ఉపాధ్యాయులు

అనంతపురం విద్య, సెప్టెంబరు 29: యూటీఎఫ్ ఏర్పాటై 50 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్వహిస్తున్న స్వర్ణోత్సవ క్రీడా పోటీలు ఆదివారం ముగిశాయి. ముగింపులో భా గంగా నగరంలోని శారద స్కూల్‌లో మహిళా ఉపాధ్యాయులకు ఆటల పోటీలు నిర్వహించారు. అంతకు ముందు యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు గోవిందరాజులు, ప్రధాన కార్యదర్శి లింగమయ్య మాట్లాడుతూ...యూటీఎఫ్ ఆవిర్భావం నుంచి నేటి వరకు ఉపాధ్యాయుల శ్రేయస్సే పరమావధిగా పోరాటాలు చేస్తోందన్నారు. ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడటంలో ఎన్నో క్రియాశీల, సమరశీల ఉద్యమాలు సాగించిందన్నారు. ఉపాధ్యాయుల కోసమే కాకుండా విద్యాభివృద్ధికి, విద్యార్థుల శ్రేయస్సుకు సామాజిక దృక్పథంతో పనిచేసే సంఘంగా ముద్ర వేసుకుందని పేర్కొన్నారు. అనంతరం చెస్, క్యారమ్స్ పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందించారు. రాష్ట్ర కార్యదర్శి కోటేశ్వరప్ప, గౌరవాధ్యక్షుడు రమణయ్య, సహాధ్యక్షులు రామప్ప, సరళ, ఇతర నేతలు ప్రమీళ, సంజీవ్‌కుమార్, శేఖర్, సుబ్బరాయుడు, దేవేంద్రమ్మ, చంద్ర మోహన్, శ్రీనివాసులు, ఆదిశేషయ్య, రఘు, నాగరాజు, నాగేంద్ర, లక్ష్మీదేవి, నాగేంద్ర కుమార్, రాజశేఖర్, విరూపాక్ష, సాలెంబాబు తదితరులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి చెస్ క్రీడాకారుల ఎంపిక


ఎంపికైన చెస్ క్రీడాకారులు

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 29: ఎస్‌జీఎఫ్-19 జిల్లాస్థాయి చెస్ క్రీడాకారులను ఎంపిక చేశారు. స్థానిక న్యూటౌన్ బాలుర జూనియర్ కళాశాల ఆవరణంలో ఆదివారం ఎంపిక పోటీలు నిర్వహించారు. ఇందులో ఆదిత్యరెడ్డి, హన్ని స్టీఫెన్, విశ్వనాథ్, మిస్బా, తరుణ్ విజేతలుగా నిలిచారు. ఎంపికైన చెస్ క్రీడాకారులు అక్టోబరు మూడో వారంలో కర్నూలులో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తారని ఎస్‌జీఎఫ్-19 జిల్లా కార్యదర్శి లక్ష్మీనారాయణ తెలిపారు. ఈ కార్యక్రమంలో చెస్ కోచ్ హుస్సేన్‌ఖాన్, పీడీలు, క్రీడాకారులు పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ బధిరుల దినోత్సవం


సంబరాలు చేసుకుంటున్న బధిరులు

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 29: అంతర్జాతీయ బధిరుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఏపీ బధిరుల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక ఆర్‌అండ్‌బీ కార్యాలయం ఆవరణంలోని ఆడిటోరియంలో కేక్‌కట్ చేసి సైగలతో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కుమార్ మాట్లాడుతూ... ప్రజలు సైగల భాషను ఆకళింపు చేసుకునేలా ప్రభుత్వం తగు సూచనలు చేయాలని కోరారు. సమాజంలో అందరితో సమానంగా బధిరులను చూడాలన్నారు. బధిర ఉద్యోగులకు సంబంధించి సర్వీస్ రూల్స్‌ను సైగల ద్వారా వివరించాలని కోరారు. కార్యక్రమంలో బధిరుల సంఘం రాష్ట్ర కోశాధికారి ఇమ్రాన్‌ఖాన్, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నాగరాజు, శ్రీరాములు, ఉపాధ్యక్షుడు రవి, గౌరవాధ్యక్షుడు సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బండమీదపల్లి చెరువుకు జలకళ


నీరు చేరి కళకళలాడుతున్న చెరువు

రాప్తాడు, సెప్టెంబరు 29: మండలంలోని బండమీదపల్లి చెరువుకు జలకళ సంతరించుకుంది. సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ కూటమి అధికారం లోకి రావడంతో ఎమ్మెల్యే పరిటాల సునీత చొరవతో హంద్రీనీవా నీరు చెరువుకు సరఫరా అవుతోంది. దీంతో చెరువుకు ఇప్పటికే 60 శాతం నీరు చేర డంతో రైతులు, ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గత వైసీపీ ప్రభు త్వంలో చెరువకు నీరు సరఫరా చేయడంలో పాలకులు, అధికారులు తీవ్ర నిర్లక్ష్యం వహించారు. ఐదేళ్లలో ఒక్క ఏడాది కూడా చెరువుకు పూర్తి స్థాయిలో నీరు సరఫరా చేయలేదు. అప్పటి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డి తన సొంత జిల్లా చిత్తూరుకు హంద్రీనీవా నీరు తరలించాలని జిల్లా లోని చెరువు లకు నీటి సరఫరా నిలిపి వేశారు. బండమీ దపల్లి చెరువుకు నీరు సరఫరా అయ్యే తూముకు రాళ్లు, మట్టి అడ్డుగా వేశారు. టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చాక ఎమ్మెల్యే పరిటాల సునీత ఆదేశాల మేరకు బండమీదపల్లి టీడీపీ నాయకులు, ప్రజలు స్వచ్ఛందంగా వెళ్లి ఆ తూముకు అడ్డుగా ఉన్న రాళ్లు, మట్టి తొలగించారు. పిల్లకాలువలోని పూడిక మట్టి, ముళ్ల చెట్లను ఎక్స్‌కవేటర్ ద్వారా తొలగించారు. నీరు సులభంగా వేగంగా చెరువుకు చేరుతోంది. చెరువుకు నీరు చేరుతుండటంతో బోర్లలో నీటిమట్టం పెరుగుతోందని రైతులు, ప్రజలు ఎమ్మెల్యేకి కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

నిరుపయోగంగా ఎలక్ట్రిక్ ఆటోలు

- మరమ్మతుకు లోనవడంతో మూలకు..
- చెత్త తరలింపునకు కష్టమవుతోందంటున్న మున్సిపల్ కార్మికులు
- బాగు చేయించి వినియోగంలోకి తేవాలని విజ్ఞప్తి


మూలన పడ్డ ఎలక్ట్రిక్ ఆటోలు

కళ్యాణదుర్గం రూరల్, సెప్టెంబరు 29: కళ్యాణదుర్గం మున్సిపాలిటీలో చెత్తను తరలించే ఎలక్ట్రికల్ ఆటోలు మరమ్మతుకు గురై మూలన పడ్డాయి. స్వచ్ఛాంధ్రప్రదేశ్‌లో భాగంగా మున్సిపాలిటీలో చెత్త తరలింపునకు ఎలక్ట్రిక్ వాహనాలను గతేడాది మే నెలలో పంపిణీ చేశారు. కేంద్ర ప్రభుత్వ నిధులతో గత వైసీపీ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా అన్ని మున్సిపాలిటీలకు వీటిని పంపిణీ చేసింది. రెండు, మూడు నెలలు మాత్రమే అవి పని చేశాయి. తర్వాత మరమ్మతులకు గురవుతుండడంతో పక్కన పడేశారు. కళ్యాణదుర్గం మున్సిపాలిటీకి ఐదు ఎలక్ట్రిక్ ఆటోలను కేటాయించారు. అవి కేవలం రెండు, మూడు నెలలు మాత్రమే పనిచేశాయి. తరువాత అన్నీ మరమ్మతుకు గురయ్యాయి. రిపేరీ చేయించినా పనిచేయలేదు. దీంతో మూలకు పడేశారు. ఒక ఆటో మాత్రమే పని చేస్తోంది. రెండు ట్రాక్టర్లు, ఒక కాంపాక్టర్ కూడా ఉన్నాయని, అందులో ఒక ట్రాక్టర్ చెడిపోవడంతో అది కూడా మూలన పడి ఉందని కార్మికులు వాపోతున్నారు. ప్రస్తుతం మున్సిపాలిటీ మొత్తం మీద ఒక ఎలక్ట్రిక్ ఆటో, ఒక ట్రాక్టర్ మాత్రమే పని చేస్తున్నాయని, మున్సిపాలిటీలో మొత్తం 24 వార్డులు వుండగా రోజుకు కొన్ని టన్నుల దాకా చెత్తను తరలించాల్సి ఉందని, ఒక్క ఆటో, ఒక ట్రాక్టర్‌లో అంత చెత్తను తరలించాలంటే ఇబ్బందిగా ఉందని వారు పేర్కొంటున్నారు. ఎలక్ట్రిక్ ఆటోలను మరో సారి మరమ్మతు చేయించాలని కోరినా అధికారులు స్పందించడం లేదని అంటున్నారు. ఇప్పటికైనా వాటిని బాగు చేయించి వినియోగంలోకి తేవాలని వారు కోరుతున్నారు.

3 నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు

తాడిపత్రి, సెప్టెంబరు 29: పట్టణంలోని బుగ్గరామలింగేశ్వరస్వామి ఆలయంలో అక్టోబరు 3 నుంచి 12వ తేదీ వరకు శరన్నవరాత్రులు జరగనున్నాయి. ఈ సందర్భంగా అమ్మవారు వివిధ అలంకరణల్లో భక్తులకు దర్శనమివ్వనున్నారు. 3న బాలత్రిపురసుందరీదేవి అలంకరణలో, 4న మహాలక్ష్మిదేవి, 5న అన్నపూర్ణాదేవి, 6న గాయత్రీదేవి, 7న భవాని, 8న సరస్వతీదేవి, 9న లలితాదేవి, 10న మహిషాసురమర్దిని, 11న రాజరాజేశ్వరిదేవి, 12న రజితకవచాలంకృత పార్వతీదేవి అలంకరణలలో అమ్మవారు దర్శనమివ్వనున్నట్లు ఆలయ నిర్వాహకులు ఆదివారం ప్రకటనలో తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

తాడిపత్రి, సెప్టెంబరు 29: పట్టణంలోని నంద్యాల రోడ్డులో గల పెట్రోల్ బంక్ వెనుక ఉన్న పేకాట స్థావరంపై ఆదివారం దాడులు చేశామని, అందులో పేకాట ఆడుతున్న 8 మందిని అరెస్టు చేసి, వారి వద్ద నుంచి రూ.32,280 నగదు స్వాధీనం చేసుకున్నామని పట్టణ సీఐ సాయిప్రసాద్ తెలిపారు. అందిన సమాచారం మేరకు సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించామని చెప్పారు.

రాయదుర్గంరూరల్: పట్టణ సమీపంలోని పేకాటస్థావరంపై ఆదివారం అర్బన్ సీఐ జయనాయక్ సిబ్బందితో కలిసి దాడులు చేశారు. అందిన సమాచారం మేరకు దాడులు నిర్వహించి అందులో పేకాట ఆడుతున్న ఏడుగురిని అదుపులోకి తీసుకున్నామని, అలాగే వారి వ ద్ద నుంచి రూ. 15 వేల నగదుతో పాటు ఆరు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామని సీఐ తెలిపారు. ఆ ఏడుగురిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరచనున్నట్లు చెప్పారు.

ద్విచక్రవాహనం అపహరణ

యాడికి, సెప్టెంబరు 29: మండలకేంద్రంలోని కుంటలో ఆదివారం ఉదయం ద్విచక్రవాహనం (స్కూటీ) అపహరణకు గురైంది. స్థానికంగా ఉన్న తన హోటల్ వద్ద ఆదివారం ఉదయం వ్యాపారంలో బిజీగా ఉన్నామని, ఆ సమయంలో ఆ పక్కనే పార్క్ చేసిన తన స్కూటీని గుర్తుతెలియని వ్యక్తులు అపహరించారని బాధితుడు మద్దిలేటి తెలిపారు. పట్టపగలే దుకాణం వద్ద స్కూటీని అపహరించారన్నారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసినటు చెప్పారు.

ఈకేవైసీకి నేటితో ముగియనున్న గడువు

యల్లనూరు, సెప్టెంబరు 29: ఖరీఫ్‌లో పంటలు సాగు చేసిన రైతులు ఈకేవైసీ చేయించుకోవడానికి సోమవారం చివరితేదీ అని వ్యవసాయశాఖ అధికారి రామకృష్ణ ఆదివారం ప్రకటనలో తెలిపారు. పంటన మోదు చేసుకుని వేలిముద్ర వేయని రైతుల జాబితా సచివాలయాల పరిధిలో ఉందన్నారు. ఈ జాబితాలో పేర్లు ఉన్న వారు వెంటనే సంబంధిత వ్యవసాయశాఖ సిబ్బంది వద్దకు వెళ్లి ఈకేవైసీ చేయించుకోవాలని సూచించారు.

బస్సు సర్వీసులు పునఃప్రారంభం

కణేకల్లు, సెప్టెంబరు 29: మండల కేంద్రం నుంచి మాల్యం మీదుగా ఉరవకొండకు బస్సు సర్వీసులను పునఃప్రారంభించారు. గతంలో కణేకల్లు నుంచి ఉరవకొండకు వెళ్లాలంటే ఆటోల్లో మాల్యంకు, అక్కడి నుంచి బస్సులో ఉరవకొండకు వెళ్లాల్సి వచ్చేది. వేదావతి హగరిలో గతంలో వేసిన రహదారి వర్షాల కారణంగా తెగిపోవడంతో ఈ పరిస్థితి ఉండేది. ప్రస్తుతం టీడీపీ నాయకులు సొంత ఖర్చులతో ఈ రహదారిని మట్టితో మరమ్మతు చేసి బస్సు రాకపోకలకు మార్గాన్ని సుగమం చేశారు. దీంతో ఆదివారం ఉదయం నుంచి బస్సు సర్వీసులు పునః ప్రారంభమయ్యాయి.

ఇసుక ట్రాక్టర్లు సీజ్

తాడిపత్రి, సెప్టెంబరు 29: మండలంలోని చిన్నపొలమడ గ్రామ సమీపంలో ఆదివారం ఇసుకను అక్రమంగా తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు రూరల్ పోలీసులు తెలిపారు. పెన్నానది నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్నట్లు సమాచారం అందిందని, దీంతో వెంటనే దాడులు చేసి ఆ ట్రాక్టర్లను పట్టుకుని సీజ్ చేశామని అన్నారు. అనంతరం డ్రైవర్లు లోకేష్, సుదర్శన్‌పై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

యాడికి: ఇసుక అక్రమ రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను ఆదివారం సీజ్‌చేసినట్లు సీఐ ఈరన్న తెలిపారు. మండలంలోని నిట్టూరు క్రాస్ వద్ద ఇసుక ను అక్రమ రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను గుర్తించి పట్టుకున్నామని, అనంతరం సీజ్‌చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించామని చెప్పారు. ట్రాక్టర్ యజమానిపై కేసు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు.

ఆటో బోల్తా.. నలుగురికి గాయాలు

పుట్లూరు, సెప్టెంబరు 29: మండలంలోని ఏ.కొండాపురం గ్రామశివారులో ఆదివారం ఆటో బోల్తాపడి నలుగురికి గాయాలయ్యాయి. తాడిపత్రి నుంచి అనంతపురం వెళుతున్న ఆటో కొండాపురం వద్దకు రాగానే అదుపు తప్పి బోల్తాపడింది. ప్రమాదంలో ఆటోలో ఉన్న అనంతపురానికి చెందిన రామాంజి, నాగరాజు, బాషా, అంజికి స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు వారిని వెంటనే తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ విషయంపై ఫిర్యాదు రాలేదని పోలీసులు తెలిపారు.

వీరాపురంలో పోలీసుల కార్డెన్ సెర్చ్

తాడిపత్రి, సెప్టెంబరు 29: మండలంలోని ఫ్యాక్షన్ గ్రామమైన వీరాపురంలో ఆదివారం తెల్లవారుజామున రూరల్ సీఐ శివగంగాధర్‌రెడ్డి, ఎస్‌ఐ కాటయ్య కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా అనుమానితుల ఇళ్లల్లో, గడ్డివాముల్లో సోదాలు చేశారు. అనంతరం సీఐ గ్రామస్థులతో సమావేశమై మాట్లాడారు. ఎవరూ ఎలాంటి గొడవలకు వెళ్లకుండా ప్రశాంత వాతావరణంలో జీవించాలన్నారు. ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పామిడి: మండలంలోని పీ కొండాపురంలో సీఐ యుగంధర్ సిబ్బందితో కలిసి కార్డెన్ సెర్చ్ నిర్వహించి అనుమానితుల ఇళ్లలో తనిఖీలు చేపట్టారు. గ్రామస్థులతో మాట్లాడుతూ ఘర్షణలకు పాల్పడకుండా శాంతియుతంగా జీవించాలని సూచించారు.

ఉరవకొండ: పట్టణంలో సీఐ సురేష్‌బాబు సిబ్బందితో కలిసి నాకాబందీ నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక బాలాజీ టాకీస్ సమీపంలో ఉన్న కొండ ప్రాంతంలో అనుమానితుల ఇళ్లల్లో తనిఖీలు చేశారు. సిబ్బంది పాల్గొన్నారు.

రాయదుర్గంరూరల్: మండలంలోని ఆవులదట్ల గ్రామంలో అర్బన్ సీఐ జయనాయక్ సిబ్బందితో కలిసి కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా అనుమానితుల ఇళ్లల్లో తనిఖీలు చేశారు. తర్వాత గ్రామస్థులతో సమావేశమై మాట్లాడారు. రోడ్డు ప్రమాదాలు, సైబర్‌నేరాలు, మత్తుమాదక పదార్థాల వల్ల కలిగే నష్టాలు తదితర వాటిపై అవగాహన కల్పించారు.

యువకుల ఘర్షణ

కళ్యాణదుర్గంరూరల్, సెప్టెంబరు 29: పట్టణంలోని వాల్మీకినగర్‌లో ఆదివారం కొందరు స్థానిక యువకులు, పాల్వాయి గ్రామానికి చెందిన యువకులు ఘర్షణకు దిగారు. ఈక్రమంలో ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. దీంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని వారిని చెదరగొట్టారు. బెట్టింగ్ వ్యవహారంలో వారి మధ్య గొడవ జరిగినట్లు సమాచారం.

నరసాపురంలో..

తాడిపత్రి: పెద్దపప్పూరు మండలం నరసాపురం గ్రామంలో ఆదివారం తెల్లవారుజామున వెంకటేష్, ఆదినారాయణ ఘర్షణ పడ్డారని పోలీసులు తెలిపారు. ఆదినారాయణ.. వెంకటేష్ ఇంటి వెనుక భాగాన మూత్రవిసర్జన చేస్తుండగా.. వెంకటేష్ తన ఇంటి వద్ద ఎందుకు ఇలా చేస్తున్నావని వాగ్వాదానికి దిగాడు. దీంతో మాటామాటా పెరిగి ఇద్దరూ ఘర్షణ పడ్డారు. అనంతరం ఎవరి ఇళ్లకు వారు వెళ్లిపోయారు. కొంతసేపటి తర్వాత ఆదినారాయణకు ఆయాసం తీవ్రమైంది. కుటుంబసభ్యులు తాడిపత్రి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

కణేకల్లు, సెప్టెంబరు 29: మండలంలోని యర్రగుంట గ్రామానికి చెందిన పోతప్ప(36) విద్యుత్‌షాక్‌తో మృతి చెందాడు. పోతప్ప గ్రామంలో ఎలెక్ట్రీషియన్ పనులు చేస్తూ జీవనం సాగించేవాడు. కాగా ఆదివారం గోపులాపురంలో ఉన్న ఓ ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతు కోసం వెళ్లాడు. మరమ్మతు పనులు చేస్తుండగా.. విద్యుత్‌షాక్ తగలడంతో కింద పడ్డాడు. స్థానికులు వెంటనే ఆర్డీటీ ఆసుపత్రికి తరలించారు. తర్వాత మెరుగైన చికిత్స కోసం రాయదుర్గం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందాడు. మృతుడికి భార్యతో పాటు ఇద్దరు సంతానం ఉన్నారు.

గుత్తికోటను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలి

గుత్తి, సెప్టెంబరు 29: గుత్తికోటను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని కోరుతూ ఆదివారం గుత్తికోట సంరక్షణ సమితి ఆధ్వర్యంలో పలువురు విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ స్థానిక గాంధీ సర్కిల్ నుంచి గుత్తి కోట వరకు కొనసాగింది. గుత్తికోట పరిరక్షణ సమితి అధ్యక్షుడు విజయభాస్కర్ మాట్లాడుతూ.. ప్రభుత్వం గుత్తికోటను పర్యాటకంగా అభివృద్ధి చేయడంతోపాటు పరిరక్షించాలని డిమాండ్ చేశారు.

హెచ్చెల్సీలో పూడిక తొలగింపు

పెద్దవడుగూరు, సెప్టెంబరు 29: మండలంలోని మిడుతూరు గ్రామం వద్ద ఉన్న నార్త్ హెచ్‌ఎల్‌సీలో పిచ్చిమొక్కల తొలగింపు, పూడికతీత పనులను అధికారులు గత రెండురోజులుగా చేపట్టి ఆదివారం పూర్తి చేశారు. కెనాల్‌లో పిచ్చిమొక్కలు పెరిగి, పూడిక పేరుకుపోవడంతో సాగునీరు చివరి ఆయకట్టు వరకు అందడం లేదు. దీంతో రైతులు సమస్యను ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు. స్పందించిన ఆయన కొన్నిరోజుల క్రితం హెచ్చెల్సీ ని పరిశీలించారు. అనంతరం ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి కాలువలో పూడికతీత పనులు చేయించారు. రైతులు హర్షం వ్యక్తం చేశారు.

విద్యార్థినులకు వ్యాసరచన పోటీలు

తాడిపత్రి, సెప్టెంబరు 29: పట్టణంలోని పుట్లూరు రోడ్డులో గల కేజీబీవీలో ఆదివారం ఉద్యోగ ఉపాధ్యాయ సామాజిక సేవా సంస్థ ఆధ్వర్యంలో 'నేడు మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలు.. నివారణ చర్యలు' అనే అంశంపై వ్యాసరచన పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో పలువురు విద్యార్థినులు పాల్గొన్నారు. తర్వాత సంస్థ అధ్యక్షుడు గుర్రప్ప ప్రతిభ చూపిన విద్యార్థినులు బాలరంగేశ్వరి, అయిషా, రజిత, నందిని, పూజ, శ్రీలేఖలకు బహుమతులను అం దించారు. ప్రిన్సిపాల్ మునెమ్మ, సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

క్రిమిసంహారక మందు ప్రభావంతో కౌలురైతు మృతి


విజయ్‌కుమార్ (ఫైల్)

కణేకల్లు, సెప్టెంబరు 29: మండలంలోని మాల్యం గ్రామంలో గల ఎస్సీకాలనీకి చెందిన కౌలురైతు విజయ్‌కుమార్(30 క్రిమిసంహారక మందు ప్రభావంతో మృతి చెందాడు. విజయ్‌కుమార్ రెండెకరాల భూమిని కౌలుకు తీసుకుని వరిపంటను సాగు చేశాడు. ఆదివారం ఉదయం అతను పంటకు క్రిమిసంహారక మందును పిచికారీ చేసేందుకు వెళ్లాడు. మాస్క్ లేకుండా పిచికారీ చేయడంతో మందు తుంపరలు మొహాన పడ్డాయి. ఈ క్రమంలో ఆ మందు వాసన పీల్చడంతో అపస్మారకస్థితిలోకి చేరుకున్నాడు. కుటుంబసభ్యులు కణేకల్లు ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్య అనంతపురం తరలించారు. అయితే అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య శివమ్మతో పాటు నలుగురు కుమార్తెలు ఉన్నారు.

పిడుగు పాటుకు 12 గొర్రెలు మృతి

గుత్తి రూరల్, సెప్టెంబరు 29: మండలంలోని చెర్లోపల్లి గ్రామశివారులో ఆదివారం రాత్రి పిడుగుపడి 12 గొర్రెలు మృతి చెందాయి. గ్రామశివారులోని గుట్టపై గొర్రెల మందను నిలుపుకుని ఉండగా.. రాత్రి ఉరుములు మెరుపులతో కుడిన గాలి వాన వచ్చిందని, ఈ క్రమంలో ఒక్కసారిగా తీగ మెరుపు మెరిసి గొర్రెల మందపై పిడుగు పడిందని, దీంతో 12 గొర్రెలు మృతి చెందాయని గొర్రెల కాపరులు లాలెప్ప, రాజశేఖర్, సుంకన్న, రామాంజునేయులు తెలిపారు. రూ. 1.20 వేలు నష్టం వాటిల్లిందని వాపోయారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

మృతురాలి కుటుంబానికి ఆర్థిక సాయం

రాయదుర్గంరూరల్, సెప్టెంబరు 29: గుమ్మఘట్ట మండలం కలుగోడు గ్రామపంచాయతీకి చెందిన బోయ జ్యోతిని భర్త వన్నూరుస్వామి ఆదివారం తెల్లవారుజామున గొంతుకోసి హత్య చేశాడు. టీడీపీ యూత్ నాయకుడు బోయపాటి మురళీకృష్ణ రాయదుర్గంలోని ప్రభుత్వాస్పత్రిలో మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించి దహన సంస్కారాలకు రూ. ఐదు వేలు ఆర్థిక సాయం అందించారు.

టీడీపీతోనే కురుబలకు న్యాయం

కళ్యాణదుర్గంరూరల్, సెప్టెంబరు 29: టీడీపీతోనే కురుబలకు న్యాయం జరుగుతుందని కురుబ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బోరంపల్లి ఆంజనేయులు తెలిపారు. పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. నవంబరు 18న భక్త కనకదాసు జయంతి ఉత్సవాలు జరుగుతాయని, కురుబలందరూ విజయవంతం చేయాలని కోరారు. టీడీపీ కురుబలకు అత్యంత ప్రాధాన్యం ఇస్తూ ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఒక మంత్రి పదవి, రెండు ఎంపీ స్థానాలు ఇచ్చిందన్నారు. ఇందుకు ముఖ్యమంత్రి చంద్రబాబుకు ధన్యవాదాలు తెలిపారు. తర్వాత సంఘానికి సంబంధించి వివిధ మండలాలు, పట్టణాల నూతన కమిటీని ఎన్నుకున్నారు.

హిందువుల మనోభావాలకు విలువ లేకుండా పోయింది

- మాజీ ఎమ్మెల్యే కొట్రికె మధుసూదన్ గుప్తా


ర్యాలీలో మాట్లాడుతున్న మధుసూదన్ గుప్తా

గుంతకల్లు, సెప్టెంబరు 29: హిందువుల మనోభావాలను దెబ్బతీసేలా తరచుగా సంఘటనలు జరుగుతున్నా ఎవరికీ పట్టింపు లేకపోవడం శోచనీయమని మాజీ ఎమ్మెల్యే కొట్రికే మధుసూదన్ గుప్తా ఆవేదన చెందారు. తిరుపతి లడ్డూలో నెయ్యి కల్తీ విషయంగా ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చేపట్టిన ప్రాయశ్చిత్త దీక్షకు మద్దతుగా పట్టణంలో ఆదివారం ఆయన జనసేన, బీజేపీ శ్రేణులతో కలిసి సంఘీభావ ర్యాలీని నిర్వహించారు. స్థానిక బీరప్ప ఆలయం వద్ద నుంచి గాంధీచౌక్ వరకూ ర్యాలీ చేపట్టారు. ఈ సంద ర్భంగా మాట్లాడుతూ.. విగ్రహాల తలలను పగులగొట్టినా, రథాలకు నిప్పుపెట్టినా.. మరొకటి ఏర్పాటు చేస్తే సరిపోతేందిలే అనేలా ధోరణులు వ్యక్తమౌతున్నాయన్నారు. ఇలాంటి ఘటనలు జరగకుండా ఎవరూ చర్యలు చేపట్టడం లేదన్నారు. హిందువుల మనోభావాలకు విలువ లేకుండాపోయిందని అన్నారు. ఇటువంటి ఆకృత్యాలను ప్రతిఒక్కరూ ప్రతిఘటించాలన్నారు. ఈ విషయంగా హిందువులను చైతన్యపరచడానికి పవన్ కల్యాణ్ నడుం బిగించడం సంతోషించదగ్గ విషయమన్నారు. కార్యక్రమంలో జనసేన నాయకుడు పూల రమణ, బీజేవైఎం నాయకుడు మంజులా వెంకటేశ్, బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎదురూరులో గడ్డివామి దగ్ధం

పామిడి, సెప్టెంబరు 29: మండలంలోని ఎదురూరు గ్రామంలో రైతు రామకృష్ణకు చెందిన గడ్డివామి ఆదివారం తెల్లవారుజామున అగ్నికి ఆహుతైంది. సుమారు రూ.1.50లక్షల విలువ గల వరిగడ్డి, వేరుశనగ పొట్టుతో రైతు వామి వేశాడు. అయితే గుర్తు తెలియని దుండగులు నిప్పు పెట్టడంతో గ్రాసం మొత్తం అగ్నికి ఆహుతైంది. స్థానికులు మంటలు అదుపుచేసే ప్రయత్నం చేసినా ఫలితం లేకపోయింది. గుంతకల్లు అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు. అప్పటికే గడ్డివామి పూర్తిగా కాలిపోయిందని బాధితుడు వాపోయాడు. సీఐ యుగంధర్ సిబ్బందితో సంఘటనాస్థలాన్ని పరిశీలించారు. గుత్తి మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ ప్రభాకర్ చౌదరి, మున్సిపల్ మాజీ చైర్మన్ గోసపీరా, టీడీపీ సీనియర్ నాయకులు భాస్కర్‌నాయుడు, నారాయణప్ప, ఓబుళనాయుడు బాధితున్ని పరామర్శించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వృద్ధురాలి ఆత్మహత్యాయత్నం

రాయదుర్గంరూరల్, సెప్టెంబరు 29: పట్టణంలోని అనంతపురం రోడ్డులో గల రైల్వే గేటు వద్ద ఆదివారం సాయంత్రం ఓ వృద్ధురాలు రైలు కింద పడి ఆత్మహత్యకు ప్రయత్నించగా.. గమనించిన గేట్‌మెన్ అప్రమత్తమై ఆమెను కాపాడారు. అనంతరం పోలీసులకు సమాచారం అందించి వారికి అప్పగించారు. పోలీసులు స్థానిక పోలీస్‌స్టేషన్‌కు ఆమెను తరలించారు. అయితే అడ్రస్ చెప్పకపోవడంతో పోలీసులు ఆమె ఫొటోలు సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేశారు. దీంతో 15 నిమిషాల లోపు ఆ వృద్ధురాలు ఆచూకీ లభ్యమైంది. ఆమె పేరు శివలింగమ్మ, డీ.హీరేహాళ్ మండలం నాగలాపురం గ్రామానికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. ఆత్మహత్యాయత్నానికి గల కారణాలు తెలియాల్సి ఉందని పోలీసులు తెలిపారు.

తూకాల్లో తేడాలు వస్తే కఠిన చర్యలు


వేయింగ్ మిషన్లకు సీల్ వేయిస్తున్న తూనికలు, కొలతల అధికారి

యాడికి, సెప్టెంబరు 29: చౌకధాన్యపు దుకాణాల్లో తూకాల్లో తేడాలు వస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా తూనికల కొలతలశాఖ అధికారి గౌరీశంకర్ హెచ్చరించారు. మండలంలోని చౌకధాన్య దుకాణాలకు సంబంధించిన వేయింగ్ మిషన్లకు ఆదివారం ఆయన సీల్ వేశారు. అనంతరం డీలర్లతో ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడారు. లబ్ధిదారులకు అందించే రేషన్ బియ్యం తూకాల్లో తేడాలు వస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. వేయింగ్‌మిషన్‌పైన డబ్బాలు ఉంచి తూకం వేయడం వంటి పనులు చేస్తే కేసులు నమోదు చేస్తామని తెలిపారు. ప్రతి చౌకధాన్యపు దుకాణ డీలర్ ప్రభుత్వ నిబంధనల మేరకు రేషన్ సరుకులు ఇవ్వాల్సిందేనని అన్నారు. బఫర్‌స్టాక్ పేరుతో తూకాలు తక్కువగా వేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. మండలవ్యాప్తంగా ఉన్న 38మంది చౌకధాన్యపు దుకాణాల డీలర్లకు సంబంధించిన వేయింగ్ మిషన్లకు సీల్ వేశారు. కార్యక్రమంలో తూనికల కొలతలశాఖ అధికారులు రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

తాడిపత్రి, సెప్టెంబరు 29: మండలంలోని వంగనూరు సమీపంలో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. కడపకు చెందిన సుబ్బరాయుడు, అరవింద్ పనినిమిత్తం తాడిపత్రికి ద్విచక్రవాహనంలో బయలుదేరారు. వంగనూరు గ్రామసమీపంలోకి రాగానే ఎదురుగా వస్తున్న గుర్తుతెలియని వాహనం ఢీకొంది. ప్రమాదంలో వారిద్దరికీ గాయాలయ్యాయి. స్థానికులు చికిత్స నిమిత్తం తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సుబ్బరాయుడును మెరుగైన చికిత్స కోసం అనంతపురం తరలించారు.

కర్ణాటక మద్యం విక్రేతల అరెస్టు

బొమ్మనహాళ్, సెప్టెంబరు 29: కర్ణాటక నుంచి అక్రమంగా మద్యంను తీసుకొచ్చి విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులకు అదుపులోకి తీసుకుని, వారి నుంచి టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసుల తెలిపారు. మండలంలోని ఉంతకల్లు గ్రామానికి చెందిన చంద్ర అనే వ్యక్తి మద్యం విక్రయిస్తుండగా అతనిని అదుపులోకి తీసుకుని 55 టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. అలాగే ఉద్దేహాళ్ గ్రామానికి చెందిన జిలాన్ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకుని అతని నుంచి 60 టెట్రాప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. వీరిపై కేసు నమోదు చేసి రాయదుర్గం కోర్టుకు హాజరు పరచనున్నట్లు పోలీసులు చెప్పారు.

విరాళం అందజేత

కుందుర్పి, సెప్టెంబరు 29: మండలకేంద్రానికి చెందిన సమాజ క్రాంతి ఛారిటబుల్ ట్రస్టు అధ్యక్షుడు లెనిన్‌బాబు వయనాడు వరద బాధితుల సహాయార్థం రూ. 17 వేలను అందించారు. విలువలబడి విద్యార్థులు విరాళాలు సేకరించగా రూ. 17 వేలు వచ్చింది. అందుకు సంబంధించిన చెక్కును ఆదివారం ఆయన అనంతపురంలో కేరళ ప్రభుత్వ ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు, వ్యవసాయ శాస్త్రవేత్త ప్రొఫెసర్ ఎమ్‌కే రామచంద్రన్‌ను కలిసి అందజేశారు. ఎమ్‌కే రామచంద్ర మాట్లాడుతూ ఈ చెక్కును కేరళ సీఎం సహాయనిధికి అందజేస్తానని తెలిపారు.

జీడిపల్లికి 805 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

బెళుగుప్ప, సెప్టెంబరు 29: మండలంలోని జీడిపల్లి రిజర్వాయర్‌కు ఆదివారం కృష్ణాజలాల ఇన్‌ఫ్లో 805 క్యూసెక్కులు ఉన్నట్లు హంద్రీనీవా అధికారులు తెలిపారు. అలాగే ఔట్‌ఫ్లో కింద హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ ఫేజ్-2కు 880 క్యూసెక్కులు వెళుతున్నాయని, ప్రస్తుతం రిజర్వాయరులో 1.667 టీఎంసీల నీటి నిల్వ ఉందని పేర్కొన్నారు.

ఘనంగా లతామంగేష్కర్ జయంతి

గుత్తి, సెప్టెంబరు 29: గుత్తి ఆర్‌ఎస్‌లోని రైల్వే ఇన్‌స్టిట్యూట్‌లో భారత రత్న లతామంగేష్కర్ జయంతి వేడుకలను ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం కల్చరల్ అసోసియేషన్ వారు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మ్యూజికల్ ఈవెంట్‌ను జరిపారు. అందులో 20 గాయకులు పాటలను ఆలాపించారు. ముందుగా రైల్వే డీజిల్ షెడ్ సీనియర్ డీఎంఈ ప్రమోద్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అసోసియేషన్ అధ్యక్షుడు మల్లికార్జున, కార్యదర్శి శాంతిప్రియ, ఆర్గనైజింగ్ సెక్రెటరీ విజయభాస్కర్, రైల్వే ఇనిస్టిట్యూట్ సెక్రెటరీ రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.